# జీవనోపాధులు

... భవితవ్యం

జూన్ 2016

## గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక



జనాందోళనకు వేదికలు ! – 7

**ఉ**త్తరాయణానందం!

*యోగ దినోత్సవానందం!*

*సంగీత దినోత్సవానందం!*

*పర్యావరణ దినోత్సవానందం!*

అనేక శతాబ్దాలుగా వైశాలి కాలం నాటి నుంచి గ్రామ పంచాయతీలు స్థానిక ప్రభుత్వాలుగా ఉంటున్నాయి. క్రమంగా అవి రాష్ట్ర ప్రభుత్వాల చేతిలో సాధనాలుగా మారి, తమ ప్రాధాన్యతను కోల్పోయాయి. అయితే 73, 74వ రాజ్యాంగ సవరణలు స్థానిక ప్రభుత్వాల స్థాయిని పునరుద్ధరించడానికి ప్రయత్నించాయి. అయితే ఇందుకు ఇంకా చాలా చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా పంచాయతీలకే నిధులు అన్నది ఈ దిశగా ఒక ముందడుగు. ఏడాదికి తలసరి రూ.488! దీనిని గ్రామసభ సభ్యులే రూపకల్పన చేసిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కోసం ఖర్చు చేస్తారు. ఈ ప్రణాళికలో పేదలు, నిస్సహాయులూ తమ వాణిని వినిపించే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత ఆ ప్రణాళిక అమలును గ్రామ సభ పర్యవేక్షిస్తుంది. ఈ నేపథ్యంలో 'జీవనోపాధులు' 'గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక'ను పరిశీలించింది.

గాంధీజీ 'విలేజ్ స్వరాజ్' అన్న ఉత్తమ పుస్తకాన్ని చదవండి.

ఈ నెల అనుబంధంలో బృహత్ ప్రయత్నం కింద 'ఆహార భద్రత హక్కు'; క్షేత్రం కింద 'ఆరావళీ పర్వత శ్రేణులు'; జీవనోపాధుల నిర్వహణ నోట్స్ కింద 'బుక్స్ ఆన్ లైవ్లీహుడ్స్, డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్'ను ఇస్తున్నాం.

ఈ నెల ఈ-లింక్స్‌లో VCA –'ఫిషింగ్' (ముక్తేశ్వరపురం); ఉపరంగం – 'ఎ గైడ్ టు ద అనాలసిస్ ఆఫ్ ఫిష్ మార్కెటింగ్ సిస్టమ్స్'; e-బుక్ – 'విలేజ్ స్వరాజ్'; V-బుక్ –'ఎ ఫిల్మ్ ఆన్ ఒడిషా ట్రైబల్ ఎంపవర్‌మెంట్ అండ్ లైవ్లీహుడ్ ప్రాజెక్ట్ ఇవ్వడం జరిగింది.

ఈ సంచిక మీకు ఉపయుక్తంగా ఉంటుందని విశ్వసిస్తూ...

**ప్రపంచ మానవతావాదుల సదస్సులో మానవతావాదులు, అభివృద్ధి కార్యకర్తలు, శాంతి కాముకులందరిని ఏకం చేయడానికి ఈ సదస్సు చక్కని వేదిక ఉండి మానవతా సంక్షోభంను ఎలా అధిగమించాల్సి ఉంది. ఇంకా చేయాల్సిన పనిని గూర్చి ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (UNDP) తెలిపింది.**



**వినమ్రతతో స్వీకరించడం మరియు సరైన ధోరణితో తప్పులను సరిదిద్దుకోగలుగుతాము.**

**ఈ నెల జీవనోపాధులు, అనుబంధాలు మరియు ఈ-కోర్సు**












జీవనోపాధులు ... భవితవ్యం

ఎడిటర్ ఇన్ చీఫ్ : జి. మురళీధర్
సీనియర్ ఎడిటర్ : టి. వెంకటేశ్వర్లు
వర్కింగ్ ఎడిటర్ : యస్.లక్ష్మణ్
సంపాదక సాహచర్యం : వి. అరవింద్
: కె. ఛాయా దేవి
: కె. రమేష్

**మాతో/మాదారిలో**

ఎ. ఉమ
జి. జానకి
జి. దయానంద్
వి. దీప్తి
కె. భారతి
బి. మధుసూదన్
పి. మధుసూదన్
కె. మంజుల
కె. కృష్ణ చైతన్య
వి. మురళీధర్
టి. నిర్మల
సి. రమేష్
ఎం. రవికృష్ణ
జి. రవిందర్
ఎం. లావణ్య
ఎ. వెంకట రమణ
కె. శ్రీదేవి
ఎం. సుగుణశ్రీ

**ప్రైవేట్ సర్క్యులేషన్ కోసం మాత్రమే**

**అక్షర లైవ్లీహుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ALPL)**

**సహకారంతో**

Contact:
Mobile: 9885499297
web: www.aksharakriti.org,
www.livelihoods.net.in
e-mail: akshara@aksharakriti.org,
jeevanopadhulu@gmail.com

**చిరునామా**
C/o. Akshara Network
for Development Support Services
HIG - II, B-12, F - 1, APHB కాలనీ
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 044

## ఈ సంచికలో...

**ప్రత్యేకం**

**ఫోకస్: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక** 11

సందర్భం - జాతీయ జలమార్గాల చట్టం, 2016 20

నెలనెలా..

సంపాదకీయం 2

స్పందన మరియు న్యూస్ 4

జాతీయ వార్తలు 5

క్షేత్రం - **లక్షదీవులు** 6

సుక్షేత్రం - **ఛోళనాయకన్స్**

మథనం - **జనాందోళనకు వేదికలు!** 7

సంభాషణ - **ఆమ్‌ఆద్మీ, నిస్సహాయులు, కమ్యూనిటీ లీడర్, క్షేత్రస్థాయి కార్యకర్త** 8

అభివృద్ధి కార్యకర్త సంభాషణ 10

జీవన తంత్రం - **చేప కథ** 21

పుస్తకాలు - క్లాసిక్ పుస్తకం : **విలేజ్ స్వరాజ్** 22

లేటెస్ట్ పుస్తకం : **డీసెంట్రలైజేషన్ అండ్ పాపులర్ డెమోక్రసీ**

లేటెస్ట్ పుస్తకం : **డీసెంట్రలైజేషన్ అండ్ లోకల్ గవర్నెన్స్**

'యోగ'క్షేమం 23

**ఈ-వనరులు:** 22
**విలువ గొలుసు విశ్లేషణ** : ఫిషింగ్ (ముక్తేశ్వరపురం)
**ఉపరంగం** : ఏ గైడ్ టు ద అనాలిసిస్ ఆఫ్ ఫిష్ మార్కెటింగ్ సిస్టమ్
**పుస్తకం** : విలేజ్ స్వరాజ్
**వీడియో** : ఏ ఫిల్మ్ ఆన్ ఒడిషా ట్రైబల్ ఎంపవర్‌మెంట్ & లైవ్లీహుడ్ ప్రాజెక్టు

బృహత్ ప్రయత్నం : **ఆహార భద్రత హక్కు**
క్షేత్రం : **ఆరావళి పర్వత శ్రేణులు**
లైవ్లీహుడ్ మేనేజ్‌మెంట్ నోట్స్ : **బుక్స్ ఆన్ లైవ్లీహుడ్స్, డెవలప్‌మెంట్ & మేనేజ్‌మెంట్**

ఈ-లైవ్లీహుడ్స్ లెర్నింగ్ కోర్స్ : క్యాప్సుల్ నెం: **295 - 317**

గమనిక: ఇందులో ప్రచురించిన రచనల్లోని అభిప్రాయాలు ఆయా రచయితలవి. వాటిని పత్రిక అభిప్రాయాలుగా భావించకూడదు.

# స్పందన




మే జీవనోపాధుల పత్రికలో 'బి.ఆర్. అంబేద్కర్' అనే ప్రత్యేక సంచిక చాలా బాగుంది. మీ బృందానికి ధన్యవాదములు.

ఇంద్రవెల్లి రమేష్
హైదరాబాద్



**'విద్యాంజలి' పథకం అన్ని ప్రభుత్వ పాఠశాలలో కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించగలదా?**

## ➤➤ న్యూస్ ◀◀

### ✠ కూరగాయల సాగుకు ప్రోత్సాహం:

తెలంగాణ రాష్ట్రంలో కూరగాయల సాగుకు మరింత ప్రోత్సాహం అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవనశాఖ మంత్రి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల అవసరాలకు సరిపడా కూరగాయలను రాష్ట్రంలోనే పండించేందుకు ప్రభుత్వం వివిధ ప్రణాళికలతో ముందుకెళుతున్నదన్నారు. ప్రస్తుతం సాగుచేస్తున్న కూరగాయల రాష్ట్రంలో 30 శాతం అవసరాలకు కూడా సరిపోవడం లేదని, మిగతావన్నీ ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఇటు వినియోగదారుడిపై అదనపు భారం పడకుండా, రైతుకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును మరింత ప్రోత్సహిస్తుందన్నారు.

### ✠ రైతు రుణమాఫీ నిధులు విడుదల:

రైతుల పంట రుణమాఫీ కింద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2019 కోట్ల రూపాయలను విడుదల చేసింది. మూడో విడత పంట రుణమాఫీ కింద ఈ నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు బడ్జెట్ ఆర్డర్‌ను ఇచ్చారు. ప్రభుత్వం ఇదివరలో రెండు దఫాలుగా రూ.8076 కోట్లను విడుదల చేసింది. తాజాగా విడుదల చేసిన నిధులతో మొత్తం పంట రుణమాఫీ కింద విడుదల చేసిన నిధులు రూ.10,095 కోట్లకు చేరాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.17 కోట్ల మేర పంట రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. 2016-17 సం॥రంలో మూడో విడత రుణమాఫీ మొత్తం రూ.4038 కోట్లకుగాను మొదటి దఫాగా 2019 కోట్లను విడుదల చేసిన అధికారులు మిగతా ఆగష్టులోపు విడుదల చేయనున్నట్లు తెలిసింది. రూ. లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు రుణ మాఫీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 35 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతున్నది.

### ✠ తెలంగాణలో పెరిగిన ఆర్టీసీ ఛార్జీలు:

తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ ఛార్జీలు పెరిగాయి. సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రవాణాశాఖ మంత్రి ఛార్జీల పెంపును అధికారికంగా ప్రకటించారు. పల్లె వెలుగు బస్సుల్లో 30 కి॥మీ. వరకు రూ.1/-, 30 కి॥మీ. దాటితే రూ.2/- పెంచుతున్నట్లు తెలిపారు. సిటీ బస్సులు, డీలక్స్, ఏసీ బస్సుల్లో 10 శాతం ఛార్జీలు పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు.

### ✠ ఆంధ్రప్రదేశ్‌కు 1000 జనఔషధి దుకాణాలు:

ఆంధ్రప్రదేశ్‌కు 1000 జనఔషధి దుకాణాలు రానున్నాయని ఆ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తెలిపారు. 50 వేల జనాభాకు జనఔషధి దుకాణాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వాసుపత్రులను కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

### ✠ వృద్ధులకు APSRTC కానుక:

వయోవృద్ధులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ నజరానా ప్రకటించింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వృద్ధులకు ఇకపై టిక్కెట్ ధరల్లో 20శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. జులై 1 నుంచి ఈ రాయితీ అమల్లోకి రానున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

### ✠ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి:

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి అన్నారు. వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే చర్యలు తెలిపేందుకు అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యానవన రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఆహార పంటలను పండించే రైతులను వ్యవసాయ రుణాల ద్వారా ఆదుకుంటామన్నారు. వ్యవసాయం నుంచి ఉద్యానవన పంటలకు మారే రైతులకు ఉచిత ఎరువులతో పాటు రాయితీలు కల్పించనున్నట్లు తెలిపారు.

(మూలం: ఈనాడు, నమస్తే తెలంగాణ) ✸

# జాతీయ వార్తలు

**✠ పప్పులకు రెక్కలు:**

పప్పుల ధరలు మరోసారి తారాస్థాయికి చేరుతున్నాయి. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ సమాచారం ప్రకారం. మినపప్పు గరిష్ఠ ధర కిలో రూ.196కి చేరింది. కందిపప్పు రూ.166, పెసరపప్పు రూ.120, శనగపప్పు రూ.105 వద్ద ఉన్నాయి. ధరల్ని తగ్గించడానికి పప్పుల నిల్వలను 1.5 లక్షల టన్నుల నుంచి 8 లక్షల టన్నులకు పెంచాలని కేంద్రం నిర్ణయించినట్లు ఆహార మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

**✠ మందకొడిగా ఖరీఫ్ సాగు:**

దేశవ్యాప్తంగా ఖరీఫ్ పంటల సాగు గత ఏడాది కంటే తక్కువ నమోదైంది. గత వ్యవసాయ సీజన్‌లో ఇదే సమయానికి 93.63 లక్షల హెక్టార్లలో పంటలసాగు కాగా ఈ ఏడాది అది 84.21 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. 9.42 లక్షల హెక్టార్ల మేర తగ్గింది. ఏడు ప్రధాన పంటల్లో ఒక్క చెరకు తప్ప మిగతా అన్ని రకాల పంటల సాగు తగ్గుతోంది. ముఖ్యంగా పత్తి సాగు 7.41 లక్షల హెక్టార్లలో తగ్గింది.

**✠ పథకాల పర్యవేక్షణకు జిల్లాస్థాయి కమిటీలు – కేంద్ర మంత్రి ఆమోదం:**

పట్టణాభివృద్ధి పథకాల ఫలాల ప్రజలకు మెరుగ్గా అందేలా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పథకాల అమలును పర్యవేక్షించేందుకుగాను 'జిల్లాస్థాయి సలహా, పర్యవేక్షణ కమిటీ'ల ఏర్పాటుకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆమోదం తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులకు కమిటీతో సముచిత ప్రాధాన్యం దక్కనుంది. ఈ మేరకు కమిటీలను ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్రం కోరింది. స్వచ్ఛ భారత్, అమృత్ (అటల్ పట్టణ రూపాంతరీకరణ, పునరుజ్జీవన పథకం), హృదయ్ (వారసత్వ నగరాల అభివృద్ధి), ప్రధాన మంత్రి ఆవాస్ యోజన – అందరికి ఇళ్ళు (పట్టణ), దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన – జాతీయ పట్టణ జీవనాధార వంటి పథకాల అమలును జిల్లాస్థాయి కమిటీలు పర్యవేక్షిస్తాయి. కనీసం 3 నెలలకు ఓసారి సమావేశమై రాష్ట్రాలకు నివేదిక సమర్పిస్తాయి. సదరు వివరాలతో రాష్ట్రాలు ఏటా కేంద్రానికి అందజేస్తాయి.

**✠ రైతులకు 3 శాతం అదనపు వడ్డీ రాయితీ:**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్వల్పకాలిక రుణాలు తీసుకునే రైతులు అదనంగా 3 శాతం వడ్డీ రాయితీని కల్పించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం వ్యవసాయ మంత్రిత్వశాఖ కేబినేట్ నోట్‌ను సిద్ధం చేసింది. ఈ ఏడాదిలో నిర్దిష్ట కాలపరిమితిలోపు రుణాలు చెల్లించే వారి కోసం అదనంగా అందించే వడ్డీ రాయితీ పథకంపై వేర్వేరు మంత్రిత్వ శాఖల అభిప్రాయాల్ని కోరినట్లు సమాచారం. ఈ పథకం కింద రైతులు 7% వడ్డీరేటుతో ఏడాది వ్యవధితో 3 లక్షల మేర స్వల్పకాలిక రుణాలు పొందవచ్చు. నిర్దిష్ట కాలవ్యవధిలోపు రుణాలు చెల్లించే వారికి 4% వడ్డీయే పడుతుంది. 2016–17 సం॥రానికి ఈ పథకాన్ని వర్తింప జేయనున్నట్లు సమాచారం. బ్యాంకులకు అందించే వడ్డీ రాయితీ పథకాన్ని గతంలో ఆర్థికశాఖ నిర్వహించగా, ఈ ఏడాది వ్యవసాయశాఖకు బదిలీ చేశారు.

**✠ పేదరిక నిర్మూలననే ప్రభుత్వ ధ్యేయం – కేంద్ర మంత్రి:**

పేదరికాన్ని పారద్రోలడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశమని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ పేదరిక నిర్మూలనశాఖ స్పష్టం చేశారు. చిన్న వ్యాపార సంస్థల ఏర్పాటుకు పట్టణాల్లోని పేదలకు రుణాలు అందించాలని బ్యాంకులను కోరారు. ఢిల్లీలో దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన జాతీయ ఉపాధి కల్పన పథకం (DDY-NULM)పై నిర్వహించిన జాతీయ సదస్సునుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ పథకం కింద స్వయం సహాయక సంఘాలకు, స్వయం ఉపాధికి రుణాలందించాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించారు. వివిధ రంగాల్లో దేశీయ, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకుగాను అనేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. దీంతో విస్తృతస్థాయిలో అర్హులైన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి వీలవుతుందన్నారు. నైపుణ్యాల పెంపు, అవసరమైన ఆర్థికసాయం, అందరికి అవకాశాలు కల్పించడం ద్వారా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నైపుణ్యాభివృద్ధి, వ్యాపార వ్యవహారాలశాఖ మంత్రి మాట్లాడుతూ 30 కోట్ల మందిలో నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు సమీకృత విధానాన్ని రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. నైపుణ్యాల పెంపునకు తగిన బోధనాంశాలతో కోర్సును, ధృవీకరణ విధానాన్ని కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకులు ఇలాంటి ధృవీకరణ ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఆర్థిక శాఖ సహాయ మంత్రి మాట్లాడుతూ ధృవీకరణలో భాగంగా ఆర్థిక లావాదేవీల విజ్ఞానాన్ని కూడా పెంచాలన్నారు. మహిళల పేరిట రుణాలను మంజూరు చేయాలని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 'ముద్ర' రుణాల లక్ష్యంలో రూ.50 వేల కోట్లు పెంచినట్లు వెల్లడించారు. నైపుణ్యాల పెంపునకు మార్గాలు...స్వయం ఉపాధి కార్యక్రమాలకు, స్వయం సహాయక సంఘాలకు ఆర్థికసాయం అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సు నిర్వహించారు.

**✠ 42 ఔషధాల ధరల తగ్గింపు:**

క్షయ, క్యాన్సర్, ఆస్థమా, హృదయ సంబంధిత సమస్యలు, కుంగుబాటు తదితర వ్యాధుల చికిత్సలో ఉపయోగపడే 42 అత్యవసర ఔషధాల ధరలను 15 శాతం వరకు కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ఔషధాల (ధరల నియంత్రణ) సవరణ చట్టంలో షెడ్యూల్ ఒకటి ప్రకారం 45 ఔషధాల ధరలను సమీక్షించామని జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (NPPA) ఓ ప్రకటనలో పేర్కొంది. మొత్తంలో 45లో 42 ఔషధాల ధరలను 15 శాతం వరకూ తగ్గించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు 32 ఐవీ ఫ్లూయిడ్ల ధరలను కూడా సమీక్షించినట్లు మరో నోటిఫికేషన్‌లో NPPA వెల్లడించింది. ఔషధ తయారీదారులు ధరల్లో మార్పులు చేయని పక్షంలో ఎక్కువగా తీసుకున్న మొత్తాన్ని వడ్డీతో సహా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని NPPA పేర్కొంది.

**✠ ఇక ప్రసూతి సెలవు 26 వారాలు!**

ప్రసూతి సెలవును 12 వారాల నుంచి 26 వారాలకు వీలు కల్పిస్తూ మాతృత్వ ప్రయోజన చట్టానికి సవరణలు చేయటానికి కేంద్ర కార్మిక మంత్రి సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిసింది. స్త్రీ, శిశు అభివృద్ధి మంత్రి ఇటీవల ప్రసూతి సెలవు పొడిగింపుపై కార్మిక మంత్రితో చర్చించిన తరువాత ఇది వెలుగులోకి వచ్చింది. దీనిపై సానుకూల అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. స్త్రీ, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ గత సెప్టెంబర్‌లో ప్రసూతి సెలవులను పెంచాలనే ప్రతిపాదన చేసింది. దీన్ని అమలుచేస్తే ప్రైవేటు రంగంలోని స్త్రీలతో పాటు అందరూ ఉద్యోగినులకు ప్రయోజనం కలుగుతుంది.

(మూలం:ఈనాడు) ✸

# లక్షదీవులు



**ల**క్షదీవులు అనునది 'లక్షద్వీపా' అను సంస్కృత పదాల నుండి ఉద్భవించింది. ఇట్టి సంస్కృత పదానికి అర్థం లక్ష దీవులను కలిగి ఉండటం. ఈ దీవులందు లక్కడీవ్, మినికాయ్ మరియు ఎమినిడీవి దీవులు కలవు. ఈ దీవులు భారతదేశ నైరుతి తీర ప్రాంతానికి 200-440 కి॥మీ.ల దూరంలో కలవు. ఈ దీవుల ఉపరితల వైశాల్యం 32 కి॥మీ.ల విస్తీర్ణంలో ఉన్నది. లాగూన్‌లు 4200 కి॥మీ.లు. కలవు. ఈ దీవులు 10 సబ్-డివిజన్‌లతో కూడి ఒక జిల్లాగా ఏర్పడినది. దీనిని భారతదేశంలో కేంద్రపాలిత ప్రాంతంగా గుర్తించబడి పరిపాలించబడుతుంది. దీని రాజధాని కవరత్తి. దీని న్యాయసంబంధ వ్యవహారాలు కేరళ హైకోర్టు పరిధిలోకి వస్తాయి.

ఈ దీవులు భూమధ్యరేఖకు దక్షిణదిశగా ఉండటంతో ఉష్ణమండల వాతావరణం, గాలిలో బాగా తేమతో ఉండటం, వెచ్చని ఆహ్లాదకరమైన శీతోష్ణస్థితులను కలిగి ఉంటాయి. ఈ దీవులలో జీవనోపాధులను పొందేందుకు వివిధ రాష్ట్రాల నుండి ప్రజలు వలస వచ్చి స్థిర నివాసం ఏర్పరచుకొని నివసిస్తున్నారు. అందువల్ల ఈ ప్రాంతం అనేక భాషల సమ్మిళితంగా ఉంది. ముఖ్యంగా మలయాళం, ఇంగ్లీష్ ఎక్కువగా మాట్లాడతారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ ప్రాంత జనాభా 64,473. అందులో పురుషులు 33,123 మరియు స్త్రీలు 31,350. ఈ ప్రాంత అక్షరాస్యత 92.28%.

ఈ ప్రాంతంలో ప్రధాన తోటపంటలైన కొబ్బరి 27 కి॥మీ.లలో విస్తరించి సాలీన సంవత్సరానికి 27.7 మిలియన్ల కొబ్బరికాయలు ఉత్పత్తి అవుతున్నాయి. దీంతోపాటు కొబ్బరి ఉత్పత్తులైన పీచు నార తయారీ పరిశ్రమలు ఉన్నాయి. ఇవి కారిడార్ మ్యాట్‌లు, నార సంబంధిత వస్తువులను ఉత్పత్తి చేస్తున్నాయి. నార సంబంధిత వస్తువులను ఉత్పత్తి చేసే చిన్న కంపెనీలు వివిధ దీవులలో ప్రైవేట్ రంగంలో ఎక్కువగా ఉన్నారు. దీంతోపాటు ఈ దీవులలో చేపల పరిశ్రమ కలదు. ముఖ్యంగా ఈ ప్రాంతం సముద్రంతో కూడి ఉండటంతో చేపల ఉత్పత్తి అధికంగా ఉంది. అందువల్ల ఈ ప్రాంతంలోని చేపలు తలసరి లభ్యత దేశంలోనే అధికంగా ఉంది.

ఈ దీవులు ప్రకృతి సహజసిద్ధ వాతావరణం, ఆహ్లాదకరమైన ప్రదేశాలతో పర్యాటక రంగం బాగా అభివృద్ధి చెందింది. ఈ పర్యాటక రంగంపై చాలా మంది ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా సహజసిద్ధమైన వృక్ష, జంతు సంపద ఇక్కడ స్పష్టంగా అగుపిస్తాయి. సముద్రంలోని స్పంజికలు పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. అందువల్ల ఇట్టి ప్రాంతాలు కాస్తా ఆలస్యంగానైన భారతదేశంలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతాలుగా పేరుపొందాయి. తద్వారా పర్యాటకుల సంఖ్య ప్రతి సం॥రం పెరుగుతూ ఉంది. ఈ ప్రాంతంలో సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ నేచర్ అండ్ స్పోర్ట్స్ (స్పోర్ట్స్) అను నోడల్ ఏజెన్సీ పర్యాటక రంగానికి సంబంధించిన ప్యాకేజీలు అందిస్తుంది. మినికాయ్, కల్పెని, కవరతి దీవులలో స్పోర్ట్స్ సేవలు అందిస్తుంది. ముఖ్యంగా స్కూబా డ్రైవింగ్, యాచింగ్, పెడల్ బోటింగ్, కయాకింగ్, కెనోయింగ్, స్విమ్మింగ్, స్నోర్‌కిల్లింగ్ మొ.వి.

ఇట్టి దీవులలో కొన్ని ప్రాంతాలలో పర్యాటకులు తిరిగేందుకు అనుమతి తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా విదేశీ పర్యాటకులకు నిషిద్ధ ప్రదేశాలకు అనుమతి లేదు. భారతదేశంలో ఆల్కహాల్ సంబంధిత ప్రస్తుత చట్టాల ప్రకారం ఆల్కహాలిక్ ఉత్పత్తులను వినియోగంకు సంబంధించి బంగా దీవులలో తప్ప మిగిలిన దీవులలో నిషేదం అమలులో ఉంది. ✸



# ఛోళనాయకన్లు



**ఛో**ళనాయకన్లు కేరళలో నివసించే ఆదిమ తెగ. వీరు నీలంబర్ అడవులలోని రాతి గుహలలో నివసిస్తూ వేటపై ఆధారపడి నివసించే ప్రధాన ఆదిమ సమాజం. చోళ అనగా అడవులు, నాయకన్లు అనగా అడవులలో నివసించే రాజులని అర్థం. ఈ గిరిజన తెగ మైసూర్ అడవుల నుండి వచ్చిన ప్రాక్తనా సమాజం నుండి ఏర్పడింది. ఇట్టి ఆదిమ సమాజం కేరళ రాష్ట్ర దక్షిణ భాగంలోని సైలెంట్ వ్యాలీ, నేషనల్ పార్క్ నివసించే చివరి ఆదిమ సమాజమే చోళనాయకన్లు. వీరు సాధారణంగా మలప్పురం జిల్లాలోని ఎర్నాడ్ తాలుకాలోని నీలాంబర్ అడవులకు సమీపంలోని కరులాయి, చుంకతార అటవీ ప్రాంతాలలో నివసిస్తున్నారు.

1960 నాటి వరకు ఈ ఆదిమ తెగ బాహ్య ప్రపంచ నాగరికతతో సంబంధం లేకుండా కడుదయనీయ పేద పరిస్థితులతో నివసించేవారు. 1991 సం॥రం నాటికి ఈ ఆదిమతెగ వారి సంఖ్య 360గా ఉండగా నేటికి వీరి సంఖ్య క్రమేణా తగ్గుతూ 191కు చేరుకుంది. వీరు చోళనాయకన్ ఆదిమతెగ భాష వాడుకలో ఉపయోగిస్తున్నారు. ఇట్టి భాష ద్రావిడ కుటుంబానికి చెందినది. వీరి సంస్కృతి సంప్రదాయాలు అడవులతో ముడిపడివున్నాయి. ఎందుకంటే వీరు అడవులలోని రాతి గుహలలో నివసిస్తున్నారు. వీరి నివాస గుహలను 'కల్లులాయి' అంటారు. అంతేగాకుండా వీరు ఆకులు, అలములతో కూడిన నివాసాలను నిర్మించుకుంటారు. ఇట్టి నివాసాలలో 2-7 కుటుంబాల వరకు నివసిస్తుంటారు. ఇలా నివసించే బృందాలను 'చెమ్మామ్' అని పిలుస్తారు. ప్రతి బృందం తమ పూర్వికులు రూపొందించిన నియమ నిబంధనలను పాటిస్తున్నారు.

ఈ ఆదిమతెగలు స్థానికంగా ఉండే అడవులలో విస్తరించి తమ సమూహాలతో పాటు నివసిస్తూ, అటవీ ఆధారిత ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉన్నారు. ముఖ్యంగా వీరు ఆహార సేకరణ కోసం వేటాడటం, కలపేతర అటవీ ఉత్పత్తులను సేకరిస్తారు. వీరు ఉపయోగించే వస్తువులు, దుస్తులు, అలంకరణ సామాగ్రి, ఆయుధాలు, వీరి శైలి అంతయు అటవీ సహజ సంపద ఉత్పత్తులతో కూడి ఉంటుంది. వీరి ప్రధాన ఆహారం వరి, అటవీ దుంపలు, వేర్లు, గింజలు, ఫలాలు మరియు జంతుమాంసం మొ.వి.

ఇట్టి గిరిజనులు అడవులు నరికివేత, జంతువులను వేటాడటం, కలపేతర అటవీ ఉత్పత్తుల సేకరణ విషయంలో అటవీ సంబంధిత అధికారుల నుండి ఒత్తిడి రావడం మరియు గిరిజనేతరులతో దోపిడికి గురికావడం చేత జనజీవన స్రవంతిలోకి వస్తున్నారు. తద్వారా బుట్టలు, చాపల అల్లికలు, కలపేతర వస్తువుల సేకరణ, వేట జీవనోపాధిగా మార్చుకొని నేడు పతనావస్థలో జీవిస్తున్నారు.

ఈ గిరిజనులు అడవులపై ఆధారపడి పొందే జీవన పరిస్థితులు, జీవనోపాధులు క్షీణిస్తున్న సమయంలో ఇతర ఉత్పత్తులు నేర్చుకొనే ప్రయత్నంలో ఉన్నారు. ముఖ్యంగా వీరు రబ్బరు తోటలలో కార్మికులుగా పనిచేస్తున్నారు. కానీ, అడవుల ద్వారా పొందిన ఆదాయ వనరులకన్నా జన జీవనస్రవంతిలో వచ్చి నేర్చుకొన్న జీవనోపాధుల వల్ల వీరి ఆర్థిక పరిస్థితి క్షీణించి దుర్భర పరిస్థితులతో తమ మనుగడను కొనసాగిస్తున్నారు.

అందువల్ల ఈ గిరిజనుల సంస్కృతి-సంప్రదాయాలను ప్రభుత్వం, అధికారులు గుర్తించి వారిని పరిరక్షించాల్సి ఉంది. దీనికిగాను ఆచరణాత్మక ప్రణాళికను రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చూడాలి. ✸

## మథనం

# జనాందోళనకు వేదికలు !

*ప్రపంచ పర్యావరణ దినోత్సవం!*

*ప్రపంచ సంగీత దినోత్సవం!*

*అంతర్జాతీయ యోగా దినోత్సవం!*

*ఉత్తరాయణం! ఏడాదిలో అత్యంత సుదీర్ఘమైన రోజు!*

బ్రెగ్జిట్ – బ్రిటన్ ప్రజలు యూరోపియన్ యూనియన్ (EU) నుంచి వైదొలగడానికి ఓటు వేశారు! మరో పర్యాయం పదవీ కాలం పొడిగింపుకు రఘురామ్ రాజన్ విముఖత చూపారు.

అణు సరఫరా బృందంలో సభ్యత్వం పొందడానికి భారత్ చేసిన కృషి ఫలించలేదు.

కేంద్రంలో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ కోసం దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అది ఎలాంటి ఆలస్యం లేకుండా తొందరగా జరిగితే బాగుంటుంది. వివిధ విభాగాలు, మంత్రిత్వ శాఖల పునర్వ్యవస్థీకరణ ఇంకా కొనసాగుతోంది.

ఇంకా అనేక కార్యదర్శుల ఖాళీలను పూరించాల్సి ఉంది. తెలంగాణలో ప్రస్తుతమున్న 10 జిల్లాలను 24–26 జిల్లాలుగా విడగొట్టడానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ కూడా అదే దారిలో ఉంది.

ఆంధ్రప్రదేశ్‌కి చెందిన అనేక మంది ఉద్యోగులు భారమైన హృదయాలతో హైదరాబాద్‌కు వీడ్కోలు చెబుతున్నారు.

దేశంలోని పలు రాష్ట్రాల్లో (యూపీ, పంజాబ్) కనీసం 6–12 నెలల ముందుగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడానికి కసరత్తు జరుగుతోంది.

స్వయం సహాయత, జీవనోపాధుల మెరుగుదల, పేదరిక నిర్మూలన, అభివృద్ధి కోసం జరిగే జనాందోళన కొరకు అనేక మంది నాయకులు, దానికి సహకరించే చేతులు అవసరం. అందుకోసం సాహిత్యం, ఉపకరణాలు, చిత్రపటాలు, దృశ్య, శ్రవణ మాడ్యూల్స్ మొదలైనవి కూడా అవసరం. ప్రచారం, ప్రజలను చైతన్యపరచడం, వారి సామర్థ్యాలు మెరుగుపరచడం, అనుభవపూర్వక భాగస్వామ్యం/అభ్యసనం, ప్రదర్శన కోసం ఆర్థిక వనరులు కూడా అవసరం. మనం వాటిని సమకూర్చుకొనగలమా? స్వచ్ఛంద కార్యకర్తలను పోగు చేయగలమా? ప్రణాళికలు రూపొందించే స్వచ్ఛంద కార్యకర్తలు? స్వచ్ఛంద రిసోర్స్ పర్సన్స్? స్వచ్ఛంద దాతలు? దాన్ని ఎలా వేగవంతం చేయగలం?

ఈ జనాందోళన కేవలం గ్రామీణ ప్రాంతాలకు పరిమితం కాదు. ఇది గిరిజన ప్రాంతాలలో ఉంది. పట్టణ ప్రాంతాలలోనూ ఉంది. అది ఇప్పుడిప్పుడే పుట్టుకొస్తున్న జీవనోపాధుల్లో ఉంది. ఇదొక నిజమైన జీవనోపాధుల ప్రజా ఉద్యమం. సుమారు 150–200 మిలియన్ల కుటుంబాలు దీనిలో భాగం కానున్నాయి. 15 మిలియన్ల స్వయం సహాయక సంఘాలు, 1 మిలియన్ ప్రాథమిక స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు, 30–40 వేల సెకెండరీ సమాఖ్యలు, 10000 మూడో స్థాయి సమాఖ్యలు, 1000 జిల్లా సమాఖ్యలు, 50–60 ప్రాంతీయ/రాష్ట్ర సమాఖ్యలు, 5–10 ప్రాంతీయ/జాతీయ సమాఖ్యలు పునాదిగా; ప్రజల బ్యాంకులు, సామాజిక సమిష్టి సంఘాలు, క్లస్టర్/బ్లాక్/జిల్లా/రాష్ట్రస్థాయిలో జీవనోపాధుల సమిష్టి సంఘాలు; వాటికి సహకరించే 10000కు పైగా కమ్యూనిటీ నిర్వాహక అభ్యసన కేంద్రాలు, వేయి మందికి పైగా జాతీయ రిసోర్స్ పర్సన్స్; 10000కు పైగా రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్, 500,000కు పైగా బ్లాక్ రిసోర్స్ పర్సన్స్, 10 మిలియన్లకు పైగా యానిమేటర్లు/క్యాడర్; 10 మిలియన్లకు పైగా బుక్‌కీపర్లు ఈ భారీ ప్రజాఉద్యమంలో భాగస్వాములుగా తయారవుతున్నారు.

ఈ జనాందోళనకు ఎన్నడూ నిరాశపరచని చేతులు, హృదయాలు, మెదళ్లు మద్దతు పలుకుతున్నాయి. మన నమ్మకం, విశ్వాసం వమ్ము కావు. మంచి అనుభవజ్ఞుల సూచనలు తీసుకుందాం. మంచి అలవాట్లను పంచుకుందాం. కేస్ స్టడీలను పరిశీలిద్దాం. సాహిత్య సహకారం తీసుకుందాం. పాటలు, వీడియోలు తయారు చేద్దాం. కళాజాతలు నిర్వహిద్దాం. వెబ్ పోర్టల్స్ తయారు చేద్దాం. న్యూస్ లెటర్లు, పత్రికలు ప్రచురిద్దాం. గొంతుకలు వినిపిద్దాం. చానెళ్లు ప్రారంభిద్దాం. చిత్రపటాలు, గోడప్రతులు తయారు చేద్దాం. వార్తాపత్రికలు ప్రారంభిద్దాం. మనం ఎక్కడెక్కడికి వెళ్లగలమో అక్కడికి వెళదాం, ఏమేం చేయగలమో అవి చేద్దాం. అదీ వీలైనంత తొందరగా! వీలైనంత ఎక్కువ మందితో! వీలైనన్ని దిక్కుల నుంచి వీలైనన్ని రంగాల నుంచి వీలైనంత ఎక్కువ మందిని చేర్చుకుందాం! ఈ వేదికలే జనాందోళనలో భాగం!

**జి. మురళీధర్** ✸




**జూన్ 5, ప్రపంచ పర్యావరణ దినోత్సవం**




**జూన్ 14, ప్రపంచ రక్తదాతల దినోత్సవం**

## తల్లిదండ్రుల సహాయం కొరకు...

**మీ గురించి మరియు మీ కుటుంబం వివరాలు తెలపండి?**



నా పేరు బుర్ర రామకృష్ణ, వయస్సు 24 సం॥రాలు. మాది వెంకటాపురం గ్రామం, కౌడిపల్లి మండలం, మెదక్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. నేను 10వ తరగతి వరకు చదువుకున్నాను. ఆ తరువాత నేను పై చదువులు కొనసాగించలేకపోయాను. ఎందుకంటే, నా తల్లిదండ్రులకు ఏదైనా పనిచేస్తూ సహాయం చేయాలనుకున్నాను. మా కుటుంబంలో నాతోపాటు మా తల్లిదండ్రులు, తమ్ముడు ఉంటాము. నా తల్లిదండ్రులకు ఉన్న 4 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తుంటారు మరియు అప్పుడప్పుడు కూలీ పనులకు కూడా వెళ్తుంటారు. తమ్ముడు చదువుతున్నాడు.

**మీరేమి పనిచేస్తున్నారు?**

నేను ఎలక్ట్రానిక్ రిపేరు మరియు వాటి వస్తువుల అమ్మకాల దుకాణాన్ని అక్టోబర్ 2015 నుండి కౌడిపల్లి పట్టణంలో నిర్వహిస్తున్నాను. నేను వివిధ రకాల ఎలక్ట్రానిక్ వస్తువులైన టి.వి.లు, టి.వి. రిమోట్లు, ఫ్యాన్లు, రేడియోలు, ఎలక్ట్రానిక్ రైస్ కుక్కర్లు, టార్చిలైట్లులను రిపేరు చేస్తాను మరియు కొత్తవి కూడా వినియోగదారులకు అమ్ముతుంటాను. ఈ దుకాణాన్ని ప్రారంభించడానికి ముందు మార్కెట్ గురించి మరియు సరైన స్థలం ఎంపిక కొరకు ఎక్కువ సమయం తీసుకున్నాను. నేను ఈ దుకాణానికి సంబంధించి ప్రారంభ పెట్టుబడి 99 వేల రూపాయల వరకు పెట్టాను. నేను ప్రతి నెల రూ.1200లు దుకాణానికి గాను అద్దె కడతాను. ఈ దుకాణం మీద రోజుకు సుమారు రూ.500-1000ల వరకు సంపాదిస్తాను. నేను ప్రతిరోజు ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 7 గం॥ల వరకు దుకాణాన్ని తెరిచి ఉంచుతాను. మా గ్రామం నుండి నా దుకాణానికి 15 కి॥మీ.ల దూరం ఉంది. వారానికి ఒకసారి కొత్త వస్తువుల కొనుగోలు కొరకు హైదరాబాద్ వెళ్తుంటాను.

**మీరు ఈ పనిని ఎక్కడ నేర్చుకున్నావు?**

నేను, నా 10వ తరగతి పూర్తయిన తరువాత మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌లోని ఎలక్ట్రానిక్ మెకానిక్ దుకాణంలో పని నేర్చుకోవడానికి చేరాను. అక్కడ నేను 6 సం॥రాలు పనిచేశాను. ఈ సమయంలో ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేరుతో పాటు దుకాణాన్ని ఎలా నిర్వహించాలనే దానిమీద అవగాహనను కూడా నేర్చుకున్నాను.

**నీ దుకాణానికి సంబంధించి ఎక్కడ నుండైన రుణాన్ని పొందావా?**

అవును. నేను స్థానికంగా ఉన్న ఫైనాన్స్ కంపెనీ నుండి సం॥రానికి 36% వడ్డీతో రుణాన్ని పొందాను. ప్రతిరోజు వీరికి రూ.200లు చెల్లించాలి.

**నీవు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి?**

నేను ఆర్థిక పరమైన ఇబ్బంది వలన దుకాణానికి సంబంధించి, వినియోగదారులకు సంబంధించి కొత్త కొత్త వస్తువులను కొనలేక పోతున్నాను. దాంతో గిరాకీ పెరగడం లేదు.

**మీరు ప్రభుత్వం నుండి ఏమైనా లబ్ధి పొందారా?**

నేను ప్రభుత్వం నుండి ఆధార్ కార్డు, ఓటర్ కార్డులను పొందాను.

**మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

నా దుకాణాన్ని అభివృద్ధి చేసుకోవాలి. అంతేగాక మా తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలి. ✸



## తొందరగా కోలుకోవాలని దేవున్ని ప్రార్థిస్తున్నా...

**మీ గురించి చెప్పండి?**

నా పేరు మర్రి కృష్ణ, వయస్సు 21 సం॥రాలు. నా స్వగ్రామం కాటాపూర్, తాడ్వాయి మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. నేను 7వ తరగతి వరకే చదువుకున్నాను. ఎందుకంటే మా ఇంట్లో ఆర్థికపరమైన సమస్య వలన పై చదువులు చదవలేకపోయాను. మా కుటుంబంలో నేను, నా తల్లిదండ్రులు ఉంటాము. నాకు ఇద్దరు అక్కలు ఉన్నారు. వారికి పెళ్ళిళ్లు అయ్యాయి. మా తల్లిదండ్రులకు ఒక ఎకరం భూమి ఉంది. అందులో వారు వ్యవసాయం చేస్తుంటారు. దాంతోపాటు కూలీ పనులకు కూడా వెళ్తుంటారు. నేను చిన్న చిన్న పనులలో వారికి సహాయం చేస్తుంటాను. నేను వికలాంగుడిని కావడంతో నేను సరిగ్గా నడవలేను.

**మీరు ఏం పనిచేస్తారు?**

నేను 2010 నుండి ఏం పనిచేయలేకపోతున్నాను. ఎందుకంటే, ఆ సం॥రంలో నాకు ప్రమాదం జరగడంతో నా కాళ్లు పనిచేయటం లేదు. నేను వైద్యం కొరకు చాలా ఆసుపత్రులు తిరిగాను కానీ, ఫలితం లేదు. నేను దాదాపు ఒక లక్ష రూపాయల వరకు ఖర్చుపెట్టాను. అంతేగాకుండా సాంప్రదాయ వైద్యుల్ని కలిసిన ఏం లాభం లేకుండా పోయింది. దాంతో నా తల్లిదండ్రులకు నా చేతనైనంత సహాయం చేస్తున్నాను. రోజువారీ పనులలో మరియు నా పనులు నేనే చేసుకుంటాను. కానీ, బరువైన పనులు చేయలేను. ఎక్కువ సమయం ఇంటి దగ్గరే ఉంటాను.

**మీరు గతంలో ఏం పనిచేస్తుండేవారు?**

నాకు ప్రమాదం జరగకముందు, నేను కూలీ పనులు చేస్తుండేవాడిని. అందులో భాగంగా ట్రాక్టర్‌లో ఇసుక, కంకర నింపడానికి మరియు దించడానికి వెళ్తుండేవాడిని. దానికిగాను ప్రతిరోజు రూ.200లు సంపాదించేవాడిని.

**మీరు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి?**

నా ఆరోగ్యం కొరకు చాలా డబ్బును ఖర్చు చేశాను. నాతోపాటు నా తల్లిదండ్రులు కూడా నా గురించి చాలా బాధపడుతున్నారు. నేను త్వరగా కోలుకోవాలని దేవున్ని కోరుకుంటున్నాను.

**మీరు ప్రభుత్వం నుండి ఏమైనా లబ్ధి పొందారా?**

ప్రభుత్వం నుండి నేను వికలాంగుల పింఛను కింద నెలకు రూ.1500లు పొందుతున్నాము. వీటితోపాటు ఓటర్‌కార్డు, రేషన్ కార్డు మరియు ఆధార్‌కార్డులను పొందాను.

**మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

నా తల్లిదండ్రులు సంతోషంగా ఉండడానికి, ఏం చేయడానికైన సిద్ధంగా ఉన్నాను. ✸

## కమ్యూనిటీ లీడర్ సంభాషణ

### మా గ్రామ చెరువుని అభివృద్ధి చేయాలి...



**మీ గురించి చెప్పండి?**

నా పేరు మొగిలిపల్లి నాగేశ్వరరావు, వయస్సు 50 సం॥రాలు. నేను ఎస్టీ (కోయ) కమ్యూనిటీకి చెందినవాడిని. మా గ్రామం బందారిగూడెం, కత్తిగూడెం గ్రామపంచాయతి, మంగపేట మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. నేను నిరక్షరాస్యున్ని. కానీ, సంతకం చేయగలను. నా కుటుంబంలో నేను, నా భార్యతో పాటు, తల్లి, కొడుకు-కోడలుతో కలిసి నివసిస్తున్నాను. మాకున్న 5 ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తున్నాము.

**మీరు ఏం పనిచేస్తారు?**

నేను ఒక రైతును. నాకున్న పొలంలో వరిని పండిస్తున్నాను. మా గ్రామంలో ఉన్న కోయ కమ్యూనిటీ మొత్తానికి నన్ను నాయకుడిగా ఎన్నిక చేసుకున్నారు. మా గ్రామంలో అన్ని (75) కోయ కుటుంబాలే ఉన్నాయి. మా గ్రామం, మండల కేంద్రానికి దాదాపు 30 కి॥మీ. దూరంలో ఉంది. మాది చాలా వెనుకబడిన గ్రామం.

గతంలో మా కమ్యూనిటీకి మా నాన్న నాయకుడిగా ఉండేవాడు. ఆయన మరణానంతరం మా ప్రజలు నన్ను వారసునిగా ఎన్నిక చేశారు. మా గ్రామాభివృద్ధిలో భాగంగా నేను ఏటూరు నాగారం ప్రాజెక్టు ఆఫీసర్ (PO)ను కలిసి మా గ్రామానికి వ్యవసాయానికి సంబంధించి భూమిని కోరడటం ద్వారా కొంత వ్యవసాయ భూమిని పొందాము. ఆ తరువాత PO గారికి బోర్‌బావి కొరకు వినతి పత్రం ఇచ్చాము. ఆయన మాకున్న మంగళికుంట చెరువును అభివృద్ధి చేశారు. నా హయాంలో దాదాపు 75 ఎకరాల భూమిని మా కమ్యూనిటీ ప్రజల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాను. అదేవిధంగా మా కమ్యూనిటీ హక్కు అయిన పోడు వ్యవసాయం చేసుకునేట్లు కూడా అనుమతి పొందాము.

మా గ్రామ ప్రజలు సమస్యలు వచ్చినప్పుడు నన్ను సంప్రదిస్తారు. అప్పుడు నేను వారికి సరైన సలహాలు ఇస్తుంటాను. కొన్ని సమయాలలో తప్పు చేసిన వారికి జరిమనా విధిస్తుంటాను. ఆ జరిమాన డబ్బును గ్రామాభివృద్ధి పనులైన డ్రైనేజీ, రోడ్డు పనులకు వినియోగిస్తుంటాను. కొన్నిసార్లు నిరుపేద ప్రజలకు రుణాన్ని వడ్డీలేకుండా ఇస్తుంటాను.

మా వ్యవసాయ పొలాలన్నీ మంగళికుంట చెరువు మీద ఆధారపడినాయి. ఇప్పుడు ఆ చెరువుకు మరమ్మత్తులు చేయించాలి. ఆ చెరువు అభివృద్ధి కోసం విరాళాలు సేకరిస్తున్నాము. అంతేగాకుండా చెరువు పరిమాణం కూడా చిన్నదిగా ఉండటం వలన నీరు సరిపోవడం లేదు. కాబట్టి నేను పదవి విరమణ చేసేలోపు ఈ చెరువు పరిమాణం పెంచి అభివృద్ధి చేయడమే నా బాధ్యత.

**మీరు ఏమైన సమస్యలను ఎదుర్కొంటున్నారా?**

అవును. అటవీ అధికారులు, రాజకీయ నాయకుల నుండి కొన్నిసార్లు సమస్యలు ఎదురవుతున్నాయి. వ్యక్తిగతంగా నేను చాలా రోజులుగా కంటి సమస్యతో బాధపడుతున్నాను.

**మీ భవిష్యత్ లక్ష్యం ఏమిటి?**

భవిష్యత్‌లో, నేను నాయకుడిగా పదవీ విరమణ పొందే లోపు మా కమ్యూనిటీ నుండి మంచి తపన, కృషి, పట్టుదల ఉన్న వ్యక్తిని నాయకుడిగా ఎన్నిక చేసి నా వారసత్వాన్ని కొనసాగించాలనుకుంటున్నాను. ✸

## కమ్యూనిటీ వర్కర్ సంభాషణ

### ప్రభుత్వ ఉద్యోగమే నా లక్ష్యం...



**మీ గురించి చెప్పండి?**

నా పేరు దుర్గం రాజు, వయస్సు 30 సం॥రాలు. మాది చింతగూడెం, ఏటూరు నాగారం మండలం, వరంగల్ జిల్లా. నా కుటుంబంలో నేను, నా భార్యతో పాటు, తల్లిదండ్రులు మరియు తమ్ముడు కలిసి ఉంటాము. మాకు 2 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మా పొలంలో బోరుబాయి కూడా ఉంది. మేము ఎక్కువగా మిరప పంట పండిస్తాము. నా భార్య టైలర్‌గా మరియు వ్యవసాయ పనులు చేస్తుంది. మా తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తారు. మా తమ్ముడు వ్యవసాయ పనులలో సహాయం చేస్తుంటాడు. మాకు రెండు ఎద్దులు మరియు ఒక ఆవు ఉంది.

**మీరు ఏం చదువుకున్నారు?**

నేను ప్రకాశం జిల్లా, చీరాలలో సత్తిపాటి శ్రీమాన్ బ్రదర్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో బి.ఎడ్.ను పూర్తిచేశాను. ప్రస్తుతం నేను పోటీ పరీక్షలకు చదువుతున్నాను.

**ప్రస్తుతం మీరు ఏమి పనిచేస్తున్నారు?**

నేను స్టార్టప్ ఆఫ్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (SVEP)లో భాగంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్‌గా (ECRP)గా ఎంటర్‌ప్రెన్యూర్‌షిడ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (EDI) సంస్థలో గత 4 నెలలుగా పనిచేస్తున్నాను. ఈ ప్రోగ్రాం తెలంగాణ జిల్లా, ఏటూర్ నాగారంలోని అన్ని గ్రామాలలో పనిచేస్తుంది. నాతోపాటు మరో ఇద్దరు ECRPలుగా పనిచేస్తున్నారు. ఏటూరు నాగారంలోని అన్ని గ్రామాలలో వ్యాపారుల గురించి సర్వే చేశాము. సర్వేలో భాగంగా మేము గ్రామ సంఘం (VO) నాయకురాలిని, సభ్యులను కలిసి గ్రామాలకు సంబంధించి వ్యాపారుల సమాచారం తీసుకున్నాము.

**మీరు ECRPగా ఎలా ఎంపికయ్యారు?**

నేను ఏటూరు నాగారం మండలం మహిళా సమాఖ్య (MMS) తరపున వార్తా పత్రికలో ప్రచురించిన ప్రకటనను చూసి ECRP ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాను. EDI & DRDA వారు రాత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూని నిర్వహించారు. అందులో మంచి ప్రతిభ చూపడంతో నన్ను ఎంపిక చేశారు. నాతోపాటు మరో ఇద్దరిని కూడా ఎంపిక చేశారు.

**మీరు గతంలో ఎక్కడెక్కడ పనిచేశారు?**

మొదట్లో నేను మా గ్రామంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయునిగా 5 సం॥రాలు పనిచేశాను. ఆ తరువాత సేంద్రీయ వ్యవసాయ కమ్యూనిటీ కార్యకర్తగా (NPM-CRP) చింతగూడెం, బుట్టాయిగూడెం గ్రామాలలో పనిచేశాను.

**మీరేమైన శిక్షణలు తీసుకున్నారా?**

నేను SVEP ప్రోగ్రాంలో భాగంగా మొబైల్ ఫోన్‌లో వ్యాపారుల వివరాలు ఎలా పొందుపరచాలో అనే అంశంపై శిక్షణ తీసుకున్నాను. మరియు సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల శిక్షణలో కూడా పాల్గొన్నాను.

**మీరు ప్రభుత్వం నుండి ఏమైనా లబ్ధి పొందారా?**

నేను ప్రభుత్వం నుండి ఆధార్ కార్డు, ఓటర్ కార్డులను పొందాను. వీటితోపాటు గతంలో చదువు కొరకు ఉపకారవేతనం కూడా పొందాను.

**భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడమే నా లక్ష్యం. ✸

# నిస్సహాయ కుటుంబాలకు సేవ చేయాలనుకుంటున్నాను...

**మీ గురించి చెప్పండి?**



నా పేరు కళ్యాణ్ కుమార్, వయస్సు 41 సం॥రాలు. 1997 సం॥రంలో కామర్స్‌లో పి.జి. చేశాను. నా స్వస్థలం అనకాపల్లి, విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. ప్రస్తుతం ఉద్యోగరీత్యా నా కుటుంబంతో చిత్తూరు జిల్లా, శ్రీకాళహస్తిలో ఉంటున్నాను.

**మీరు ఎక్కడ పనిచేస్తున్నారు?**

నేను 2011 నుండి సేవ్ అవర్ సోల్ (SOS) సంస్థలో ఫ్యామిలీ స్ట్రెంథనింగ్ ప్రోగ్రాం(FSP)కు సీనియర్ కో-వర్కర్‌గా తిరుపతిలో పనిచేస్తున్నాను.

**మీ పని నేపథ్యం గూర్చి చెప్పండి?**

నా ఉద్యోగ నేపథ్యం: నా పరిధిలో ఉన్న 260 కుటుంబాలు మరియు 450 పిల్లల యొక్క అవసరాలు తీర్చడంతోపాటు సుస్థిర అభివృద్ధి కొరకు పనిచేస్తున్నాను. ఈ FSP బలహీనవర్గాల పిల్లలు ఎవరైతే 12 ఏళ్ళ లోపు ఉన్న వారికి సహాయకరంగా ఉంటుంది. బలహీన కుటుంబాలను ఎంపిక చేసేముందు వివరమైన కుటుంబ అభివృద్ధి ప్రణాళికను వారి అవసరాలను గుర్తించడానికి చేస్తాము.

FSP, ఒక కుటుంబానికి ఆరోగ్యం, పోషకాహారం, జీవనోపాధులు, విద్య, కమ్యూనిటీ అభివృద్ధి వంటి గురించి సమగ్రంగా సహాయం చేస్తుంది. మేము గ్రామాలలో పిల్లలకు రిమిడియల్ ట్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేయటమే కాకుండా వారి చదువులో భాగంగా పుస్తకాలు, బ్యాగులు, అవసరమైన వాటిని కూడా ఇస్తాము. దీనివల్ల పిల్లల చదువును ప్రోత్సహించడం మరియు పిల్లల డ్రాపౌట్లను తగ్గించడం. మరియు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి పిల్లలలో రక్తంలోని హిమోగ్లోబిన్ పరిశీలించి పోషకాహారం ఉన్న పిల్లలకు మల్టీవిటమిన్ సిరప్‌ను వైద్యుని సలహా ద్వారా ఇస్తాము.

మేము గ్రామాలలో మహిళలతో కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్ (CIG)లను ఏర్పాటు చేయించడం మరియు వారు సక్రమంగా పొదుపులు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తాము. మేము ఆదాయం పెంపొందించే కార్యక్రమాలను కూడా మహిళలకు మరియు సంఘాలతో ప్రారంభించాము. మేము తల్లిదండ్రులకు పిల్లల హక్కులు వంటి అంశంపై శిక్షణలు ఇవ్వడం జరిగింది. మరియు గ్రామాలలో మహిళల హక్కులు, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం, HIV/AIDS, పోషకాహారం, స్వచ్ఛ భారత్ వంటి విషయాల మీద అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశాము.

**మీరు గతంలో ఎక్కడ పనిచేశారు?**

నేను 1997-2002 వరకు వివిధ కళాశాలలో లెక్చరర్‌గా కామర్స్‌ను బోధించాను. 2002-2004 వరకు లైవ్లీహుడ్స్ అసోసియేట్‌గా వెలుగు ప్రాజెక్టులో పనిచేశాను. 2004-2009 వరకు నేను డా॥రెడ్డీస్ ఫౌండేషన్‌లో లైవ్లీహుడ్స్ అడ్వాన్స్‌మెంట్ బిజినెస్ స్కూల్ ప్రోగ్రాంలో పనిచేశాను. తరువాత తూర్పుగోదావరి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ టెక్నికల్ కన్సల్టెన్సీ (APITCO)లో క్లస్టర్ కో-ఆర్డినేటర్‌గా పనిచేశాను. 2010-2011 వరకు ప్రోగ్రాం ఆఫీసర్‌గా ఆంధ్రప్రదేశ్ ఉడెన్ టాయ్ క్లస్టర్ క్రింద అరబిందో చౌదరి మెమోరియల్ గ్రేట్ ఇండియా డ్రీమ్ ఫౌండేషన్‌లో పనిచేశాను.

**ఇప్పటి వరకు మీరు సాధించిన వాటి గురించి చెప్పండి?**

నా పనిలో భాగంగా, నేను ఒక పరస్పర ఎయిడెడ్ సహకార సంఘంను ప్రారంభించి మరియు రిజిస్ట్రేషన్ కూడా చేయించాను. దానిలో భాగంగా సమిష్టిగా వేరుశనగ మార్కెటింగ్‌ను ప్రోత్సహించి మరియు వారికి ట్రాక్టర్ పొందేలా చేశాను. గాజుల తయారీ వారిని గుర్తించి సహాయం చేయడం మరియు 180 గుర్తింపు కార్డులను డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యాండీక్రాఫ్ట్ నుండి పొందేలా చేసి వారు డిపార్ట్‌మెంట్ నుండి లబ్ధి పొందేలా చేశాను. APITCOలో పనిచేస్తున్నప్పుడు 3 కామన్ ఫెసిలిటీ కేంద్రాలను కొబ్బరిపీచు తయారీదారులతో మరియు వారు సహాయం పొందేలా చేశాను. డా॥రెడ్డీస్ ఫౌండేషన్‌లో పని చేస్తున్నప్పుడు 2000 మంది యువకులకు శిక్షణ ఇప్పించి, వారికి ఉద్యోగం లభించేలా చేశాను. నేను 60 మంది క్లస్టర్ కో-ఆర్డినేటర్‌లకు శిక్షణ ఇచ్చాను, మరియు 20 మంది అసిస్టెంట్ ప్రోగ్రాం మేనేజర్లకు జీవనోపాధుల పెంపుదల మరియు కార్యాచరణ ప్రణాళిక (LEAP) మీద శిక్షణ ఇచ్చాను. 2013లో మహిళా సంఘాలకు శిక్షణతో పాటు మెటీరియల్ తయారు చేసి ఇచ్చాను.

**మీరు పొందిన అనుభవాలను తెలపండి?**

ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగంలో భాగంగా నేను అద్వకసీలో భాగంగా వివిధ ప్రభుత్వ అధికారులను కలవడం ద్వారా నేను చాలా నేర్చు కుంటున్నాను. నా అనుభంలో కొత్త నైపుణ్యాలు, మెళకువలు నేర్చుకోవడం వల్ల బలహీనవర్గాలతో, గ్రామాల కమ్యూనిటీతో పనిచేయడం వలన వారికి సేవ చేయడానికి ఎంతగానో ఉపయోగపడింది. నాకున్న 14 సం॥రాల అనుభవంలో అభివృద్ధి కార్యకర్తగా మరియు లెక్చరర్‌గా పనిచేశాను.

**మీ పనిలో భాగంగా ఎదుర్కొంటున్న సవాళ్ళు మరియు సమస్యలను ఏ విధంగా అధిగమించారు?**

గిరిజన ప్రాంతాలలో పాఠశాల డ్రాపౌట్లు తగ్గించడమనేది నాకు అతి పెద్ద సవాలు. ఈ ప్రాంతాలలో ఎక్కువగా ఇంట్లో పెద్ద పిల్లలు తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్ళిన తరువాత వారి చిన్న పిల్లలను చూసుకోవడానికి డ్రాపౌట్ పిల్లలు ఉంటున్నారు. దాంతో వారు పాఠశాలకు రాలేక పోతున్నారు. ఇటువంటి సమస్యలు అధిగమించడానికి ఆ పిల్లల తల్లిదండ్రులను కలిసి విద్య యొక్క ప్రాముఖ్యత, విద్య పిల్లలకు ఏవిధంగా అవసరం ఉందో వారితో చర్చించి, మరియు వారికి కౌన్సిలింగ్ కూడా ఇవ్వడం ద్వారా డ్రాపౌట్ పిల్లలు తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా చేశాను. ఈ గిరిజన ప్రాంతంలో చిన్న పిల్లలను చూసుకోవడానికి క్రెచ్ కేంద్రాలను ఏర్పాటు చేశాను. మరియు తగినటువంటి ఆదాయ కార్యక్రమాలను గుర్తించడం ద్వారా నేను సఫలమయ్యాను. అదేవిధంగా పిల్లల క్లబ్స్‌ను కూడా ఏర్పాటు చేశాము. పై సమస్యలు అధిగమించడానికి ఇలాంటి కార్యక్రమాలు చేశాము.

**మీరు పాల్గొన్న శిక్షణల గురించి చెప్పండి?**

నా పనిలో భాగంగా ఇప్పటి వరకు వివిధ రకాల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నాను. SERP నిర్వహించిన లైవ్లీహుడ్స్ అసోసియేట్ లెర్నింగ్ ప్రోగ్రామ్ మీద మరియు డా॥ రెడ్డీస్ ఫౌండేషన్‌లో లైఫ్ స్కిల్ మీద TOTగా శిక్షణ తీసుకున్నాను. APITCOలో ఉన్నప్పుడు క్లస్టర్ డెవలప్‌మెంట్ & బిజినెస్ డెవలప్‌మెంట్ మీద మరియు SOSలో లీడర్‌షిప్, కిశోరబాలికల విద్య, నైపుణ్యాలు వంటి అంశాలపై శిక్షణలు తీసుకున్నాను.

**మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

భవిష్యత్‌లో నేను డెవలప్‌మెంట్ ప్రొఫెషనల్‌గా అభివృద్ధి చెందడం మరియు నిస్సహాయ కుటుంబాల జీవనోపాధులను పెంపొందించడం ద్వారా ఆర్థిక ఆదాయాలను పెంచడం ద్వారా మనదేశ GDPలో పాలుపంచు కోవాలనుకుంటున్నాను. ✸

# గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక

భారతదేశ గ్రామీణ పాలనలో గ్రామ పంచాయతీ అన్నది ప్రాథమిక యూనిట్. గ్రామ పంచాయతీ అంటే స్థానిక స్వయం పాలనా సంస్థ. ఒక గ్రామ పంచాయతీ అభివృద్ధి గ్రామస్థుల భాగస్వామ్యం, స్థానిక వనరుల సమర్థ వినియోగం, పాలనా సహకారం, రాజకీయ చిత్తశుద్ధి మొదలైన అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. గ్రామాల అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించుకోవడం అవసరం. రాజ్యాంగంలోని 243 (G) ఆర్టికల్ గ్రామ పంచాయతీల అభివృద్ధి గురించి వివరిస్తుంది. ఒక గ్రామ పంచాయతీ అభివృద్ధి దాని అభివృద్ధి ప్రణాళిక మీద ఆధారపడి ఉంటుంది. ఈ ప్రణాళికను స్థానిక కమిటీ తమ అవసరాలు, లభించే వనరుల ఆధారంగా తయారు చేస్తుంది. ఆ తదనంతరం దానిని గ్రామసభ లాంఛనంగా ఆమోదిస్తుంది. ఈ నేపథ్యంలో 'జీవనోపాధులు' 'గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక'ను పరిశీలించింది.



భారతదేశ గ్రామీణ పాలనలో గ్రామ పంచాయతీ అన్నది ప్రాథమిక యూనిట్. గ్రామ పంచాయతీ అంటే స్థానిక స్వయం పాలనా సంస్థ. ఒక గ్రామ పంచాయతీ అభివృద్ధి గ్రామస్థుల భాగస్వామ్యం, స్థానిక వనరుల సమర్థ వినియోగం, పాలనా సహకారం, రాజకీయ చిత్తశుద్ధి మొదలైన అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. గ్రామాల అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించుకోవడం అవసరం. రాజ్యాంగంలోని 243 (G) ఆర్టికల్ గ్రామ పంచాయితీల అభివృద్ధి గురించి వివరిస్తుంది. ఒక గ్రామ పంచాయతీ అభివృద్ధి దాని అభివృద్ధి ప్రణాళిక మీద ఆధారపడి ఉంటుంది. ఈ ప్రణాళికను స్థానిక కమిటీ తమ అవసరాలు, లభించే వనరుల ఆధారంగా తయారు చేస్తుంది. ఆ తదనంతరం దానిని గ్రామసభ లాంఛనంగా ఆమోదిస్తుంది.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అంటే గ్రామస్తుల అవసరాలు, ప్రాధాన్యతలు. దీనిలో స్థానికులు తమ ప్రాధాన్యతలను తామే నిర్ణయించుకుని వివిధ ప్రభుత్వ పథకాల నుంచి లభించే నిధులతో పాటు వివిధ మార్గాల ద్వారా నిధులను రాబట్టేందుకు కృషి చేస్తారు. భారతదేశంలో స్థానిక ప్రభుత్వాలు రెండు రకాలు. ఒకటి – మూడంచెల వ్యవస్థ; రెండు – రెండంచెల వ్యవస్థ. మూడంచెల వ్యవస్థలో జిల్లా, బ్లాక్, గ్రామ పంచాయతీలుంటాయి. రెండంచెల వ్యవస్థలో జిల్లా, బ్లాక్ స్థాయిలుంటాయి. స్థానిక సంస్థలను 1992లో 73,74వ రాజ్యాంగ సవరణలలో సూచించిన మార్గదర్శకాల ద్వారా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రెండు సవరణల ద్వారా దేశవ్యాప్తంగా ఏకరూపత కలిగిన పంచాయతీ రాజ్, నగరపాలిక సంస్థలు (పట్టణ పాలక సంస్థలు) ఏర్పాటు చేయబడ్డాయి.

రాష్ట్ర చట్టసభలు రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్‌లో వివరంగా పేర్కొన్న 29 అంశాలను పంచాయతీలకు అప్పగించడానికి; వాటిపై ప్రణాళికలు రూపొందించుకొని, వాటిని అమలు చేయడానికి; పంచాయతీల ఆర్థిక అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం కృషి చేస్తాయి. రాష్ట్ర ఆర్థిక కమిషన్ గ్రామాలకు జిల్లాస్థాయి, బ్లాక్ స్థాయి సంస్థల ద్వారా గ్రాంట్లు మంజూరు చేస్తుంది. ఈ గ్రాంట్లు పై నుంచి కిందికి అన్న విధానంలో అందుతాయి. అన్ని గ్రామ పంచాయతీలు ప్రభుత్వం నుంచి నిధులు అందుకుంటాయి. గిరిజన ప్రాంతాలకు షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ (PESA) చట్టం, 1996 ప్రకారం ప్రత్యేక అధికారాలుంటాయి.

మన దేశంలో స్థానిక సంస్థల గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో స్పష్టమైన అంశాలుంటాయి. ఉదా: నిస్సహాయ, వెనుకబడిన వర్గాల ప్రాధాన్యతలు, వారి జీవనోపాధి అవకాశాలు మొ.వి. అదే సమయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలాంటి వాటి ద్వారా పేదరిక నిర్మూలన మీద కూడా దృష్టి కేంద్రీకరిస్తారు. ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో అనేక అభివృద్ధి పథకాలను అమలు చేస్తోంది. అయితే గ్రామస్తులు,స్థానిక అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో అవి తగినంత ప్రభావం చూపడం లేదు.

గ్రామ పంచాయతీ కూడా వివిధ శాఖల కార్యకలాపాల పర్యవేక్షణలో తగినంత సమర్థంగా వ్యవహరించడం లేదు. గ్రామ పంచాయతీలలో క్షేత్రస్థాయిలో జవాబుదారీతనం, పారదర్శకత లోపించడం వల్ల, సుస్థిర అభివృద్ధి జరగడం లేదు. అందువల్ల గ్రామసభ స్థాయిలో ఒక ప్రణాళికను రూపొందిస్తే, దీని ద్వారా ప్రజలకు సాధికారత సమకూరి, సుస్థిర అభివృద్ధి సాధ్యపడుతుంది. గ్రామం అవసరాలు, ప్రాధాన్యతలు గ్రామస్తులకే తెలుసు కాబట్టి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో వారి అభిప్రాయాలే కీలకం. ఆర్థిక, సాంకేతిక, ఇతర వనరులను ఏ విధంగా సేకరించాలి,



గ్రామస్థాయిలో మరింత మెరుగైన సేవలు ఎలా అందేలా చూడాలన్న దానిపై స్థానికులే గ్రామాభివృద్ధి విషయంలో మేలైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. గ్రామాభివృద్ధి విషయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఒక రోడ్ మ్యాప్‌గా ఎలా ఉపయోగపడుతుందన్న దాన్ని ఈ క్రింద చూడవచ్చు:

* స్థానిక అవసరాలు, అసంతృప్తులు, ప్రాధాన్యతలు గురించి చర్చించడానికి ఇది ఒక వేదికగా ఉపయోగపడుతుంది.
* స్థానిక ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. స్థానిక ప్రజలే జవాబుదారీతనం వహిస్తారు. పారదర్శకత ఉంటుంది.
* పైస్థాయి, కిందిస్థాయిలో సంబంధాలు మెరుగుపడతాయి.
* వివిధ రంగాలకు సంబంధించి పైకి/కిందికి, వివిధ స్థాయిలలో అధికారుల మధ్య సమన్వయం ఏర్పరుస్తుంది.
* ప్రాధాన్యతలకు అనుగుణంగా వనరుల కేటాయింపు చేసుకోవడం వీలవుతుంది.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సాధించాల్సిన లక్ష్యాలు, చేరుకోవాల్సిన గమ్యాలు తక్కువ ఖర్చుయ్యేలా, సమర్థమైనవిగా, సుస్థిరమైనవిగా ఉండాలి.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక యొక్క మొదటి ప్రాధాన్యత – అంత్యోదయ. దీని ద్వారా స్థానిక ప్రజల గొంతుక వినిపించి, వారి ప్రాధాన్యతలు, అవసరాలు తెలిసి, స్థానిక అభివృద్ధి సమస్యలు, వాటికి పరిష్కారాలు కనుగొనడం సాధ్యపడుతుంది. ఇందుకోసం వివిధ వనరుల సేకరణ, వాటిని గ్రామాభివృద్ధికి సమర్థంగా వినియోగించుకోవడం కోసం ఒక సమిష్టి దృక్పథం అవసరం. ఇది ఉన్న వనరులను ఒకచోటికి చేర్చి, ప్రభుత్వాలు, ఇతర సంస్థల నుంచి అదనపు వనరులను సేకరించడానికి ప్రయత్నిస్తుంది. స్థానికంగా రూపొందించిన ప్రణాళిక వల్ల వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, జవాబుదారీతనం అలవడతాయి. స్థానిక అవసరాలకు తగినట్లుగా వివిధ శాఖలను సమన్వయపరచుకోవడం, ఆయా గ్రామ పంచాయితీల మధ్య పోటీతో వాటి సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడం సాధ్యపడుతోంది. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక వల్ల అనేక లాభాలున్నాయి. వాటిలో కొన్ని:



* స్థానిక ప్రజల అవసరాలు, డిమాండ్లను ఒక చోటికి చేర్చే క్రమబద్ధమైన విధానంగా రూపు దిద్దుకుంటుంది.

* ఒక పంచాయతీ ప్రాంతంలో అప్పటివరకు లబ్ధి పొందని/పట్టించుకోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది.

* ఇది వివిధ వర్గాల ప్రజల అవసరాలను, వాటి ప్రాధాన్యతను ప్రతిఫలిస్తుంది.

* అన్ని వర్గాల ప్రజలను చైతన్యపరచి, వారు స్థానిక పాలనలో భాగస్వామ్యం వహించేలా ప్రోత్సహిస్తుంది.

* నిర్ణయాలు తీసుకోవడంలో గ్రామస్తులందరికీ భాగస్వామ్యం కల్పిస్తుంది.

* ప్రజలు తమ హక్కులు/అధికారాలు/సేవలు పొందేందుకు అవకాశం కల్పిస్తుంది.

* వివిధ వనరుల ద్వారా ఆర్థిక వనరులు పోగు చేస్తుంది.

* పంచాయతీలు, స్థానిక ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తుంది.

* స్థానిక స్వయం పాలనను ప్రోత్సహిస్తుంది.

* స్థానిక వనరుల సమీకరణను పెంపొందిస్తుంది.

* గ్రామీణ ఆర్థికాభివృద్ధిని, సమర్థతను పెంపొందిస్తుంది.

* గ్రామస్తులలో జవాబుదారీతనాన్ని పెంపొందిస్తుంది.

* గ్రామస్థాయిలో నిర్ణయాధికారాన్ని, అమలు చేసే అధికారాన్ని గ్రామసభలకు కట్టబెడుతుంది

* అధికారుల ఎక్కువగా కలుగజేసుకోవడానికి అడ్డుకట్ట వేస్తుంది.

* సేవలను మెరుగుపరుస్తుంది

* పౌరులను చైతన్యపరుస్తుంది.

* స్వచ్ఛంద సేవను ప్రోత్సహిస్తుంది

* ప్రజాసంస్థలు, బృందాల మధ్య సంబంధాలు బలపడేందుకు వీలు కల్పిస్తుంది

* స్థానిక పాలనను మెరుగుపరుస్తుంది

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలోని ముఖ్యమైన అంశాలను మనం 1992లో గ్రామ పంచాయితీలకు తమ తమ ప్రాంతాలలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి అనేక అధికారాలు అప్పగించినపుడు చూడవచ్చు. ముఖ్యంగా ఈ చట్టంలోని 45, 59 సెక్షన్లు గ్రామ పంచాయతీలకున్న అధికారాలు, వాటి కార్యకలాపాల గురించి వివరిస్తుంది. సెక్షన్ 45 గ్రామ పంచాయితీలు ఖచ్చితంగా చేపట్టి తీరాల్సిన కార్యకలాపాలను వివరిస్తుంది.

వివిధ రకాల ప్రణాళికలు గ్రామాల్లో నివసించే ప్రజల అవసరాలను తీరుస్తాయి. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ప్రజల జీవితాల్లో ఒక స్పష్టమైన మార్పును తీసుకువచ్చి, గ్రామపంచాయతీలకు ఒక నిర్దిష్టమైన రూపునిస్తుంది. పంచాయతీలు ఎదుర్కొనే ఒక అతిపెద్ద సమస్య ఆర్థిక వనరులు. అయితే నేడు గ్రామపంచాయతీలు వివిధ చోట్ల నుంచి ఆర్థిక వనరులను పొందగలుగుతున్నాయి. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ద్వారా గ్రామ పంచాయతీలు వివిధ చోట్ల నుంచి వనరులను సమీకరించగలుగుతున్నాయి.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలలో ఏకీకృతమన్నది చాలా కీలకమైన అంశం. గ్రామ పంచాయతీలు వివిధ శాఖలు, సంస్థల నుంచి వనరులను సమీకరించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పన్నులు, జరిమానాలు, ఫీజులు, పన్ను ఇతర మార్గాల ద్వారా వివిధ ఆర్థిక సంస్థ నుంచి నిధుల సమీకరణను మెరుగుపరుస్తుంది.

మహాత్మాగాంధీ స్వయం పాలన శక్తిని విశ్వసించేవారు. ఆయన, “అధికారం ప్రజల్లో ఉంటుంది. దానిని వారు ఎప్పుడైనా ఉపయోగించుకోవచ్చు” అనేవారు. అంతే కాకుండా – “స్వాతంత్ర్యం కింది స్థాయిలో ప్రారంభమవుతుంది... గ్రామాలను స్వయం సుస్థిరత కలిగి ఉండేలా, తమ కార్యకలాపాలను తాము నిర్వహించుకునేలా నిర్మించాలి” అని పేర్కొనేవారు. “ఏవైనా బయటి శక్తులు దానిని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తే తనను తాను రక్షించుకొనే క్రమంలో అది తాను నశించకుండా సిద్ధంగా ఉండేలా దానికి శిక్షణనివ్వాలి” అనేవారు. మహాత్మాగాంధీ గ్రామపంచాయతీ వ్యవస్థను ప్రోత్సహించారు. భారత సామాజిక వ్యవస్థకు అదే మూలమని నమ్మేవారు. అదే ప్రభుత్వ వికేంద్రీకరణ విధానమని, ప్రతి గ్రామం దానికదే స్వయం సుస్థిరతతో ఉండాలని విశ్వసించేవారు. దానినే ఆయన ‘గ్రామ స్వరాజ్యం’ (గ్రామాల స్వయం పాలన) అనేవారు. కేంద్రీకృత ప్రభుత్వాల కన్నా వీటినే ప్రోత్సహించాలని భావించారు. అధికారిక నిర్వహణా యూనిట్లు ఈ స్థానిక సంస్థలను నియంత్రిస్తూ, ఎన్నికైన గ్రామ పంచాయితీలకు సాధికారత చేకూర్చడం మీద దృష్టి పెట్టాలి. ఈ దిశగా 1992లో పంచాయత్ రాజ్ వ్యవస్థ రూపుదిద్దుకుంది.

**కేంద్ర, రాష్ట్ర పథకాలు:**

పంచాయతీ స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులను ఖర్చు చేస్తున్న వివిధ శాఖలు ఉదా: జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (NRLM), జాతీయ ఆరోగ్య మిషన్ (NHM), సర్వశిక్ష అభియాన్ (SSA) మొదలైన వాటిని గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో చేర్చవచ్చు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో ముఖ్యమైన అంశాలు:

ఒక గ్రామం సంపూర్ణాభివృద్ధి సాధించాలంటే, గ్రామపంచాయతీ స్థాయిలో చేపట్టే ప్రణాళికా రూపకల్పనలో ఈ క్రింది విషయాలపై ప్రధానంగా దృష్టి సారించాలి.

1. పారిశుద్ధ్యం, తాగు నీరు
2. సహజ వనరుల నిర్వహణ
3. మానవ వనరుల అభివృద్ధి
4. ఆరోగ్యం, పోషకాహారం
5. వ్యవసాయం
6. సామాజిక భద్రత, పేదరిక నిర్మూలన

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలోని ప్రధాన అంశాలు, దానిలోని వివిధ స్థాయిలను ఈ క్రింద ఇవ్వడం జరిగింది:

***1.ప్రజా చైతన్యం:*** అభివృద్ధిలో గ్రామస్థులందరి భాగస్వామ్యం ప్రణాళిక రూపకల్పనలో మొదటి అడుగు. స్థానిక ప్రజలను చైతన్యపరచడం ద్వారా ప్రణాళికా రూపకల్పన ప్రారంభమవుతుంది. దాని తర్వాత ప్రజల్లో అవగాహన పెరిగి, సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ కమిటీలు గ్రామపంచాయతీ ప్రాథమిక సమాచారాన్ని, అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులను సేకరిస్తాయి.

***2. స్పందన, సామర్థ్యాల నిర్మాణం:*** సంబంధిత ప్రతినిధులు, అధికారులు ఈ ప్రణాళిక రూపకల్పనలో పాలు పంచుకుంటారు. వివిధ రకాల శిక్షణ, సామర్థ్య నిర్మాణాల ద్వారా వారు అవసరాలకు తగినట్లు స్పందించేలా చేస్తారు. ఇది రాష్ట్ర పంచాయతీ రాజ్ సంస్థ మార్గదర్శకత్వంలో జరుగుతుంది.



***3. గ్రామసభ:*** గ్రామస్తులు తమ అవసరాలు, సమస్యలు, అసంతృప్తులు, ప్రాధాన్యతలు, తమకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పన కొరకు ప్రణాళికా రూపకల్పనలో పాలు పంచుకొంటారు. ఎన్నికైన ప్రతినిధులతో కలిసి వివిధ కమిటీలుగా ఏర్పడే గ్రామస్తులు జీవనోపాధుల సమీక్ష, అభివృద్ధి సమస్యలు, గ్రామ సమస్యలు మొదలైన వాటిపై చర్చిస్తారు.

ప్రణాళికా రూపకల్పనలో సమస్యను సమీక్షించడం, పరిష్కారాన్ని కనుగొనడమన్నది ముఖ్యమైనది. ఇలా తయారు చేసిన ప్రణాళికను పంచాయతీ కార్యదర్శికి సమర్పిస్తారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ద్వారా పంచాయతీలో నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుంటారు. ఇది పంచాయతీరాజ్ చట్టం నిర్దేశించిన విధంగా గ్రామంలో ప్రాథమిక సేవల నాణ్యత మెరుగుపరచడంలో గ్రామపంచాయతీల చిత్తశుద్ధిని చూపుతుంది.

ఆ తర్వాత గ్రామ పంచాయతీ పరిస్థితిపై అధికారిక నోట్స్‌ను సంబంధిత మండలాధికారుల ద్వారా ఆరోగ్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, వ్యవసాయం, పాఠశాల విద్య, మహిళా శిశుసంక్షేమం, ఎస్సీ/ఎస్టీ సంక్షేమం మొదలైన శాఖలకు అందజేస్తారు. పరిస్థితిని సమీక్షించిన అనంతరం, అధికారులు గ్రామస్తుల అవసరాలను గుర్తిస్తారు.




స్థానికంగా ఏమేమి అవసరాలున్నాయో బ్లాక్ స్థాయి అధికారులు అంచనా వేస్తారు. ఏయే పనులు పెండింగ్‌లో ఉన్నాయో సమీక్షించి, ప్రాధాన్యతాక్రమాన్ని బట్టి వాటిని చేపడతారు. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ దశలలో పనులను బట్టి నిధులను విడుదల చేస్తాయి.

***ముసాయిదా గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ:*** ప్రాజెక్టులు, ప్రాధాన్యతలు నిర్ణయించుకున్న తర్వాత వివిధ రంగాల కోసం ఆయా శాఖలు ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేస్తాయి. ఈ ముసాయిదా ప్రణాళిక – ప్రధాన రంగాల్లో చేపట్టాల్సిన పనులు, నిధుల కేటాయింపు, ఆ పని చేయడానికి పట్టే సమయం, పని పూర్తయితే వాటి వల్ల కలిగే ప్రయోజనాన్ని సూచిస్తుంది.

మండల, బ్లాక్ స్థాయి శాఖలు తయారు చేసిన సమీకృత ముసాయిదా ప్రణాళికను గ్రామసభ పరిశీలన కోసం పంపుతారు. ముసాయిదాకు తుది రూపు ఇచ్చేందుకు, దానిని ఆమోదించడానికి ఒక ప్రత్యేక గ్రామ పంచాయతీ సమావేశం ఏర్పాటు చేస్తారు. ఈ ఆమోదించిన ముసాయిదాను ఆమోదముద్ర కోసం గ్రామసభకు సమర్పిస్తారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో ప్రతిపాదించిన అధికారిక ఏర్పాట్లను ఈ క్రింద ఇవ్వడం జరిగింది:




**ఎ) మానవ వనరులు:** ప్రణాళిక రూపకల్పన కార్యక్రమాన్ని పూర్తి చేయడానికి జిల్లా స్థాయిలో ఈ క్రింది శాఖల అధికారులు అందుబాటులో ఉంటారు.

1. గ్రామపంచాయతీ నియంత్రణలో ఉండే పంచాయతీ అధికారులు
2. గ్రామపంచాయతీ నియంత్రణలో లేని పంచాయితీ అధికారులు
3. మండలస్థాయి అధికారులు
4. జిల్లాస్థాయి అధికారులు

పైన పేర్కొన్న అధికారుల సమూహం నుంచి ఈ క్రింది నిర్వహణా ఏర్పాట్లు చేస్తారు.

**బి) పంచాయతీ కార్యదర్శి:** పైస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనలకు అనుగుణంగా గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రణాళిక రూపకల్పన జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లను గ్రామ కార్యదర్శి చేస్తాడు. గ్రామసభల నిర్వహణకు, కమిటీలు తమ కార్యకలాపాలు నిర్వహించేందుకు, ప్రణాళికా రూపకల్పనతో సంబంధమున్న ఇతర కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శి చేస్తాడు.

**సి) ప్రత్యేకాధికారి:** గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీలో మాదిరి ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమిస్తారు. ఈ ప్రత్యేకాధికారికి అవసరమైన సహకారాన్నంతా పంచాయతీ కార్యదర్శి అందజేస్తాడు. గ్రామ పంచాయతీకి చెందిన కార్యనిర్వాహక కమిటీ వ్యవహారాలన్నిటినీ ఈ ప్రత్యేకాధికారి పర్యవేక్షిస్తారు.

**డి) కార్యనిర్వాహక కమిటీ:** ఈ కమిటీలో క్రిందివారుంటారు:

1. ఒకరు, లేదా ముగ్గురు వార్డు సభ్యులు
2. ఒకరు లేదా ఇద్దరు స్వయం సహాయక సంఘాల నాయకులు
3. గ్రామంలో ఉన్న ఎవరైనా పదవీ విరమణ పొందిన అధికారులు
4. ఆయా అంశాలలో అనుభవమున్న ఎవరైనా వ్యక్తులు

5) సంబంధిత గ్రామ/మండల స్థాయి అధికారి కన్వీనర్‌గా ఉంటాడు: కార్యనిర్వాహక కమిటీలో ఏడుగురు సభ్యులకన్నా మించి ఉండరాదు.

**ఈ) విస్తరణ అధికారి (EO):** బ్లాక్ లేదా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ ప్రణాళికా తయారీ నిర్విఘ్నంగా కొనసాగడానికి, పై అధికారులు ఇచ్చే ఆదేశాలను పాటించడానికి, మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికా రూపకల్పన జరిగేలా చూడాల్సిన బాధ్యత ఈ EOలదే. ప్రణాళికా రూపకల్పన సందర్భంగా అవసరమైన సమాచారాన్ని అందజేసే, నివేదికలు సమర్పించే బాధ్యత కూడా ఆయనదే.



ఎఫ్) బ్లాక్/మండల స్థాయి శాఖలు: కార్యనిర్వాహక బృందాలు చేసే పనిని బలోపేతం చేయడానికి మండల శాఖల్లో ఈ క్రింది వారుంటారు.

1. బ్లాక్/మండల పరిషత్ అభివృద్ధి అధికారి – కన్వీనర్
2. తహసీల్దార్లు
3. విస్తరణ అధికారి (పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి)
4. అసిస్టెంట్ ఇంజనీర్ (పంచాయతీరాజ్)
5. అసిస్టెంట్ ఇంజనీర్ (గ్రామీణ త్రాగునీటి విభాగం)
6. అసిస్టెంట్ ఇంజనీర్ (విద్యుత్)
7. మెడికల్ ఆఫీసర్ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)
8. వ్యవసాయాధికారి

9. అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (పేదరిక నిర్మూలనా పథకం)

బ్లాక్ ఛేంజ్ అసిస్టెంట్ (BCA): ప్రతి మండలానికి ఒక చేంజ్ ఏజెంట్‌ను నియమిస్తారు. ఇతను గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీని సమన్వయపరుస్తాడు. ఈ BCA ప్రజల సమిష్టి చైతన్యాన్ని కలిగించడంలో, దానిని సమాజంలో మార్పు వైపుకు మళ్లించడంలో కీలకపాత్ర పోషిస్తాడు. గ్రామ సభలను నిర్వహించి, అభివృద్ధిలో ప్రజలు పాలుపంచుకునేలా వారిని ప్రోత్సహిస్తాడు. వీరు బ్లాక్‌లు, పంచాయతీలలోని వివిధ శాఖల మధ్య సమన్వయం కుదురుస్తారు. BCAను బ్లాకులు, జిల్లాల మధ్య మధ్యవర్తిగా భావించవచ్చు.

డివిజనల్ పంచాయతీ అధికారి (DPO) : డివిజన్‌లో అన్ని ప్రణాళికల తయారీని సమన్వయపరిచే బాధ్యత DPOదే. అన్ని శాఖలు నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రణాళిక తయారీలో పాల్గొనేట్లు చూస్తూ, సీనియర్ అధికారులతో సమన్వయపరుచుకోవడం DPO బాధ్యత. సమన్వయపరంగా తలెత్తే ఎలాంటి సమస్యలైనా పరిష్కరిస్తూ, పరిష్కారం కాని సమస్యలను వెనువెంటనే పై అధికారులకు తెలియజేస్తాడు.

నిధుల కొరత లేదా తగినన్ని నిధులు లేకపోవడం వల్ల గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అమలు అన్నది ఒక పెద్ద సమస్యగా మారుతోంది. అందువల్ల ఆదాయ మార్గాలను అన్వేషించకపోయినట్లైతే గ్రామపంచాయతీలు నిలదొక్కుకోలేవు. గ్రామపంచాయతీలు అభివృద్ధి చెందాలంటే గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికకు ఎక్కువ నిధులు అవసరం. వాటిని ఆర్థిక అవసరాలకు అనుగుణంగా మంజూరు చేస్తారు. ఈ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫైనాన్స్ కమిషన్ సూచనలకు అనుగుణంగా విడుదల చేస్తాయి.

**14వ ఫైనాన్స్ కమీషన్ ప్రాముఖ్యత ఏమిటి?**

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక విజయవంతం కావాలంటే, తగినన్ని ఆర్థిక వనరులు అందాలి. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులను పొందుతున్నాయి. ఫైనాన్స్ కమిషన్ మరియు స్థానిక రాష్ట్ర ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సంబంధిత జిల్లాలకు నిధులను విడుదల చేస్తుంది.

14వ ఫైనాన్స్ కమిషన్ క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలులో కీలకపాత్ర పోషిస్తోంది. ఇప్పటివరకు ఈ కమిషన్ రాజ్యాంగంలోని 9వ భాగం కింద గ్రామ పంచాయతీలకు 2,00,292.20 కోట్లు అందేలా చేసింది. ఇది ఏడాదికి తలసరిన రూ.488 ఇస్తుంది. సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ నిరంతరం స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌లను నిశితంగా పరిశీలిస్తూ, తానిచ్చే గ్రాంట్లను అవి ఎందుకు సద్వినియోగం చేయడం లేదో సమీక్షిస్తుంటుంది. సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌కు నిధులను విడుదల చేస్తే, అది జిల్లాలకు గ్రాంట్‌లను విడుదల చేస్తుంది. జిల్లా స్థాయి అధికారులు తిరిగి ఆ మొత్తాన్ని బ్లాక్‌లకు విడుదల చేస్తే, అవి చివరకు గ్రామ పంచాయతీలకు చేరతాయి.

**జిల్లాస్థాయి సమన్వయ కమిటీ (DLCC) బాధ్యతలు:**

* గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తీర్మానాలను అమలయ్యేలా చూడడం
* DLCC ఆదేశాలను ఉప జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాటిస్తున్నారా లేదా చూడడం
* అన్ని పథకాలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చేందుకు కృషి చేయడం
* క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలకు ప్రతిస్పందించడం; వాటికి పరిష్కారాలు సూచించడం, విపత్తు నిర్వహణ
* క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలున్నాయేమో తెలుసుకుని వాటిని పరిష్కరించడం
* అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామపంచాయితీ అభివృద్ధి ప్రణాళికలు రూపకల్పనకు అవసరమైన మానవ వనరులు లభించేలా చూడడం. వారికి నిర్దిష్టమై బాధ్యతలు అప్పగించడం
* సంబంధిత వ్యక్తుల సామర్థ్య నిర్మాణంలో సమన్వయం సాధించడం
* రాష్ట్ర మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికకు అవసరమైన సెకెండరీ డాటాను సేకరించడం
* ప్రాజెక్టులకు అవసరమైన సాంకేతిక సమీక్ష, ఆమోదం విషయంలో సహకారాన్ని అందించడం.
* జిల్లా స్థాయిలో మొత్తం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కార్యకలాపాలను పర్యవేక్షించి, వాటికి తగిన దారిని చూపడం
* గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అమలును పర్యవేక్షించడం
* గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఫీడ్‌బ్యాక్‌ను, ఉత్తమ పద్ధతులను నివేదిక రూపంలో జిల్లా స్థాయి అధికారులకు అందజేయడం

**బ్లాక్ స్థాయి సమన్వయ కమిటీ (BLCC) బాధ్యతలు:**

* బ్లాక్, గ్రామ పంచాయతీ స్థాయిలో వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండేలా చూడడం





1.గ్రామ సభ

2.గ్రామ పంచాయతీ

3.మధ్యంతర పంచాయతీ

4.జిల్లా కలెక్టర్/చీఫ్ ఎగ్జికూటివ్ ఆఫీసర్; జిల్లా పరిషత్/ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్;

5.రాష్ట్ర ప్రభుత్వం

**మెరుగైన ప్రదర్శన కనబరిచే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను గుర్తించడం:**

ఏ పంచాయితీ గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను సమర్థంగా అమలు చేస్తుందో గుర్తించి, దానిని ప్రోత్సహించడం జరుగుతుంది. అది ఇతర గ్రామ పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తుంది. దానిని ఇతర గ్రామ పంచాయతీలు అనుసరిస్తాయి. కొన్నిసార్లు అదే రాష్ట్రం లేదా పక్క రాష్ట్రంలో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్న గ్రామపంచాయతీలను ఇతర పంచాయితీలు సందర్శిస్తాయి. మెరుగైన ప్రదన్శన కనబరిచే గ్రామ పంచాయితీలకు అవార్డులు, ర్యాంకులు కూడా ఇవ్వడం జరుగుతుంది. ఆయా గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న అధికారులను రిసోర్స్ పర్సన్స్‌గా ఉపయోగించుకోవడం జరుగుతుంది.

**సామర్థ్య నిర్మాణం:**

ఒక గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక విజయం ఒక క్రమపద్ధతిలో దాని సామర్థ్యాలను నిర్మించడం మీద ఆధారపడి ఉంటుంది. అయితే కేవలం శిక్షణ పొందిన అధికారులు మాత్రమే సామర్థ్యాలను నిర్మించగలరు. దానికితోడు, గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక విజయం సాధించాలంటే పంచాయతీ రాజ్ సంస్థలు, శిక్షణ పొందిన నిపుణులైన అధికారులు, విధాన రూపకర్తలు, వివిధ శాఖల అధిపతులు, సీనియర్ అధికారులు, జిల్లా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి, జిల్లా కలెక్టర్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అధికారి తదితర భాగస్వాములందరి సహకారం, సమన్వయం అవసరం.

అదే విధంగా, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి, పంచాయితీ ఎగ్జిక్యూటివ్ అధికారి, పంచాయితీ కార్యదర్శి, వివిధ శాఖల ఇంజనీర్లు, సాంకేతిక సహాయకులు, గ్రామసేవకులు, గ్రామ రోజ్‌గార్ సహాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్లు, ANM/ASHA వర్కర్లు, స్వయం సహాయక బృందాలు, గ్రామ సంఘాల లీడర్లు, సభ్యులు, స్కూల్ టీచర్లు, వ్యవసాయాధికారులు, వెటర్నరీ ఆఫీసర్, సహాయ అటవీ అధికారి మొదలైన వారి సమన్వయం కూడా అవసరం. ఎన్నికైన ప్రతినిధులు కూడా గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అమలులో ముఖ్యపాత్ర పోషిస్తారు.

ఒక గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక విజయవంతం కావాలంటే, గ్రామ పంచాయతీల సామర్థ్య నిర్మాణం చాలా ముఖ్యమైన అంశం.

రాష్ట్ర అధికారులు అన్ని రాష్ట్రస్థాయి గ్రామ పంచాయతీలలో పాల్గొనలేరు. అందువల్ల వారు ఒక రిసోర్స్ పర్సన్‌ను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తారు. రాష్ట్రస్థాయి అధికారులను మాస్టర్ ట్రైనర్స్ అని పిలుస్తారు. క్షేత్రస్థాయి కార్యకర్తలను రిసోర్స్ పర్సన్స్ అని పిలుస్తారు. ఈ రిసోర్స్

* బ్లాక్‌లో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అమలు కోసం క్లస్టర్‌స్థాయి సాంకేతిక సహకార బృందాలు అందుబాటులో ఉండేట్లు చూడడం

* MGNREGS, NHRM, NRLM, ICDS, SSA, SBM మొదలైన పథకాల పునరేకీకరణ జరిగేట్లు చూడడం

* క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, పరిష్కరించడం. ఒకవేళ అవి పరిష్కరించబడకపోతే, వాటిని జిల్లాస్థాయి అధికారుల వద్దకు పంపడం.

* గ్రామపంచాయతీలకు అవసరమైన ఏవైనా మావన వనరులను కల్పించి, స్థానికంగా తలెత్తే లోటుపాట్లను పూరించుకోవడం.

* గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పరికరాలు, సాంకేతిక వనరులు అందుబాటులో ఉండేట్లు చూడడం.

* క్లస్టర్, గ్రామ పంచాయితీ, ఉపగ్రామ పంచాయతీ స్థాయిలో సామర్థ్యాల పెంపుకు అవసరమైన సహకారాన్ని అందించడం.

* బ్లాక్, క్షేత్రస్థాయిలో అనుకూల పరిస్థితులను ఏర్పరచడం

**సమీక్ష, పర్యవేక్షణ, మదింపు:**

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక యొక్క విజయం దాని అమలు, పర్యవేక్షణ మీద ఆధారపడి ఉంటుంది. గ్రామస్థులు నిరంతరం క్షేత్రస్థాయిలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అమలు జరిగే తీరును పరిశీలిస్తుంటారు.

అందువల్ల వారు తేలికగా దానిని సమీక్షించి, తమ నిర్ణయానికి అనుగుణంగా అది అమలు జరుగుతుందా, లేదా అన్నదానిపై స్థానిక, పైస్థాయి అధికారులకు ఫీడ్‌బ్యాక్ ఇవ్వగలుగుతారు. గ్రామపంచాయతీ స్థాయిలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సమర్థంగా అమలు జరగడానికి ఇలాంటి సమీక్ష చాలా అవసరం. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అమలులో ఈ క్రింది అంశాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి:



కార్యక్రమాలు ప్రారంభిస్తూనే ఉంటాయి. పేదలకు సమర్థంగా సేవలు అందించాలంటే వాటన్నిటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడం అవసరం. ఈ కార్యక్రమాలు పేద ప్రజలకు అటవీ హక్కులు, సామాజిక భద్రత, ఆహార భద్రత, విద్య, పోషకాహారం, ఆరోగ్యం, నివాసం తదితర అంశాలలో వారికి హక్కులు, అధికారాలు కల్పిస్తాయి. MGNREGS, NRLM పథకాలు పేదలకు జీవనోపాధులు కల్పిస్తుండగా, స్థానిక సంస్థలు కూడా దానిలో ఒక ముఖ్యపాత్రను పోషిస్తున్నాయి.

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ప్రధానంగా విద్య, అక్షరాస్యత, నైపుణ్యాభివృద్ధి, పిల్లల ఆరోగ్యం, ప్రజా ఆరోగ్యం, ఆహారం, పోషకాహారం మీద దృష్టి సారిస్తాయి. ఇవి ప్రధానంగా అంగన్‌వాడీలు, పాఠశాలలు, ఆసుపత్రుల ద్వారా అమలు జరుగుతాయి. ఇలా మౌలిక సదుపాయాల కల్పన మెరుగైతే, ప్రభుత్వం సులభంగా తన లక్ష్యాలను చేరుకో గలుగుతుంది.

పర్సన్స్ క్షేత్రస్థాయిలో ఆరోగ్యం, MGNREGS, పారిశుద్ధ్యం, జీవనోపాధులు, వాటర్‌షెడ్, అక్షరాస్యత తదితర అంశాల్లో ప్రజలతో కలిసి పని చేసే పౌర సామాజిక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల ప్రతినిధులను గుర్తిస్తారు.

ఈ మొత్తం సామర్థ్య నిర్మాణ శిక్షణకు రాజీవ్‌గాంధీ పంచాయత్ స్వశక్తికరణ్ అభియాన్ (RGPSA), MGNREGS, NRLM, మరియు SBM నుంచి సమీకరించిన నిధులతో శిక్షణ ఇస్తారు.

**గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సమీకరణ:**

గ్రామాల్లో అనేక పథకాలు అమలు జరుగుతున్నాయి. గ్రామాభివృద్ధి కోసం ఈ పథకాలన్నిటికీ ఒకే గొడుగు కిందికి తీసుకురావడం చాలా అవసరం. MGNREGS, NRLM, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (PMGSY), ఇందిరా ఆవాస్ యోజన, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన, రాజీవ్‌గాంధీ పంచాయత్ స్వశక్తికరణ్ అభియాన్ మొదలైన పథకాల ద్వారా ప్రజలు ఉమ్మడి సంపదను సృష్టించడం, గ్రామాభివృద్ధికి అవసరమైన సేవలు అందించడం జరుగుతోంది.

**గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఫలితాలు:**

ఇప్పటి వరకు మొత్తం 26 జిల్లాలలో 24 జిల్లాలు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను రూపొందిస్తున్నాయి. ఏ ప్రణాళికను రూపొందించినా దానిని క్షేత్రస్థాయిలో అమలు చేయడం జరుగుతోంది. అన్ని రాష్ట్రాలూ నీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, వీధి దీపాలు, ఆటస్థలాలు, పార్కులు, స్మశానాలు మొదలైన ప్రాథమిక సేవలకు ప్రాధాన్యతను ఇస్తున్నాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాలన్నిటికీ సొంత నిధులతో పాటు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, 14వ ఫైనాన్స్ కమిషన్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్, పేదరిక నిర్మూలన కార్యక్రమం మొదలైన వాటి ద్వారా నిధులు అందుతున్నాయి.

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ప్రధానంగా పేదరిక నిర్మూలన మీద దృష్టి సారిస్తుంది. అయితే, మన ప్రభుత్వాలు పేద ప్రజల కోసం పలు పథకాలు,

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ప్రధానంగా ఎస్సీ/ఎస్టీలు, నిస్సహాయ స్థితిలోని గిరిజన బృందాలు (PVTGs), మైనారిటీలు, వికలాంగులు, వృద్ధులు, మహిళలు, పిల్లలు, వెట్టిచాకిరీ పని వాళ్ళు, బాల కార్మికులు, డీనోటిఫైడ్ తెగలు, సంచారజాతులు, విపత్కర వలసదారులు, పాకీ పనివాళ్లు, ట్రాన్స్‌జెండర్లు, మానవ అక్రమ రవాణా బాధితులు మొదలైన వారి పరిస్థితిలో మార్పు తీసుకురావడానికి కృషి చేయాల్సి ఉంటుంది.

**ఆర్థికాభివృద్ధి:**

గ్రామ పంచాయతీలు స్థానిక ప్రజల కార్యకలాపాలను, వారి ఉత్పత్తులను, ఉపాధిని, మార్కెట్ అందుబాటును, విలువ జోడింపును, పశుసంపదను, మత్స్యసంపదను, భూమి అభివృద్ధి కార్యకలాపాలను, నీటిపారుదల చెరువులు, సరస్సులు, బావులు మొదలైన వాటిని మెరుగుపరిచే విధంగా ఉండాలి. అవి వ్యవసాయ, అనుబంధ రంగాలను, సాంప్రదాయ వృత్తులను ప్రోత్సహిస్తూ, ఆర్థికాభివృద్ధిలో వారూ భాగస్వాములయ్యేలా చేయాలి.



**ప్రభుత్వ సేవల అందుబాటు:**

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అతి తక్కువ ఖర్చుతో స్థానిక అభివృద్ధి సాధించడంపై దృష్టి పెడుతూనే, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తుంది. ఉదా: జనన, మరణ ధృవీకరణ పత్రాలు, వ్యాపార లైసెన్సులు, పర్మిట్లు, సంక్షేమ సేవలు, ఎలక్ట్రానిక్ యంత్రాల ద్వారా సామాజిక భద్రతా పింఛన్ పథకం మొ.వి.

**సుపరిపాలన:**

ప్రభుత్వ సేవల అమలును మెరుగుపరచడంతో పాటు ప్రజలు, మరీ ప్రత్యేకించి అట్టడుగు వర్గాల భాగస్వామ్యం ఉండేలా చూడాలి. బడ్జెట్ మరియు ఖర్చులలో పారదర్శకత, ప్రజల పర్యవేక్షణ ఉండేలా చూడాలి.

పేదల సంస్థలు – మరీ ప్రత్యేకించి స్వయం సహాయక బృందాలు, మహిళా బృందాలతో భాగస్వామ్యం కూడా అవసరం. ఇందుకోసం ప్రతి గ్రామ పంచాయతీలో సిటిజన్స్ చార్టర్‌తో పాటు ఒక సుపరిపాలన ప్రణాళిక కూడా అవసరం.

**గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో సవాళ్లు:**

ఆర్థిక వనరుల కొరత, రాజకీయ జోక్యం, ఎన్నికల్లో తప్పుడు విధానాలు, అధికారులు, అధికారేతరుల మధ్య కొరవడిన సమన్వయం, బ్లాక్‌స్థాయిలో సమన్వయలేమి, గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించకపోవడం తదితర సమస్యల కారణంగా క్షేత్రస్థాయిలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను అమలు చేయడం కష్టసాధ్యమవుతుంది. దానికి తోడు చాలా గ్రామ పంచాయితీలు తమకు రావాల్సిన పన్నులు వసూలు చేసుకోకపోవడంతో స్థానికులు గ్రామపంచాయతీలు కేవలం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్, కేంద్ర ప్రభుత్వం మీదే ఆధారపడాలనే భ్రమలో ఉన్నారు. దీని వల్ల చాలా మంది పన్నులు ఎగువేస్తుండడంతో, గ్రామ పంచాయతీలు తమ ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితితో లేవు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అమలులో మరో ముఖ్యమైన సమస్య – రాజకీయ జోక్యం. స్థానిక అధికారులతో కుమ్మక్కవుతున్న పంచాయతీ కార్యదర్శులు పలు ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు చెందిన నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. మొత్తంగా చూస్తే, గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక స్ఫూర్తిని దానికి ఎదురవుతున్న సవాళ్లు దెబ్బ తీస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం, వివిధ ప్రొసీజర్లను క్రమబద్ధీకరించడం ద్వారా వీటిని పరిష్కరించవచ్చు.

**ముగింపు:**

మహాత్మాగాంధీ లక్ష్యమైన స్వయం సాధికారతను గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ద్వారా నిజం చేసే ప్రయత్నం జరుగుతోంది. ప్రజలు స్థానిక, సహజ, భౌతిక, సామాజిక, మానవ, ఆత్మిక, ఆర్థిక వనరులను ఉపయోగించుకుంటూ, ప్రభుత్వ శాఖలు, సంస్థల నుంచి నిధులు రాబడుతూ తమకు అవసరమైన ప్రణాళికలను తామే తయారు చేసుకోవడం, తద్వారా అభివృద్ధి వైపు పయనించడమన్నది గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలోని నూతనాంశం. ప్రజలందరినీ భాగస్వాములు చేయడం ద్వారా గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ప్రజలకు సాధికారతను చేకూరుస్తుంది. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ద్వారా గ్రామ పంచాయతీలు బలోపేతం కావడం మాత్రమే కాకుండా, పాలనా వికేంద్రీకరణ కూడా జరుగుతోంది. గ్రామసభ చేతిలోని నిర్ణయాధికారం వల్ల సత్వర గ్రామీణాభివృద్ధి జరిగి, తద్వారా గ్రామస్తులకు అధికారాలు, హక్కులు సంక్రమించి, ప్రభుత్వ సేవలు మెరుగుపడుతున్నాయి. ✷

**వ్యాపారం**

**వ్యక్తిగత**

**సమిష్టి**




**కొబ్బరికాయలు అమ్మకం**



**సిలువాయ్ నగర్ (SHG)**
**ద్వారా సముద్ర గవ్వలతో వస్తువుల తయారీ**

# జాతీయ జలమార్గాల చట్టం, 2016

**భా**రతదేశంలో నదులు, కాలువలు, బ్యాక్‌వాటర్స్, సముద్రపు కయ్యలు మొదలైన అనేక దేశ అంతర్గత జలమార్గాల వ్యవస్థ ఉంది. దేశం మొత్తంలో 14,500 కిలోమీటర్ల పొడవైన జలమార్గాలుండగా, వాటిలో 5,200 కిలోమీటర్లు నదులలోను, 4 వేల కిలోమీటర్లు కాలువల రూపంలోను ఉన్నాయి. వాటిలో మరపడవలు ఉపయోగించుకునే వీలుంది.

**ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా:** దేశ భూభాగంలోని జలరహదారులలో ఓడ రవాణా మరియు నౌకాయానం కొరకు 1986, అక్టోబర్ 27న 'ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా' (IWAI) ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంస్థ ప్రధానంగా జలరవాణా, రోడ్డు రవాణా, హైవేల శాఖ ఇచ్చే గ్రాంట్ల ద్వారా జాతీయ జలమార్గాలలో మౌలిక సదుపాయాల కల్పన, వాటి అభివృద్ధి, నిర్వహణ కోసం పలు ప్రాజెక్టులు చేపడుతుంది.

ఇటీవల గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ 2015లో ఇచ్చిన సమాచారం ప్రకారం, కనీసం 25 కిలోమీటర్ల పొడవున్న జలమార్గాలను జాతీయ జలమార్గాలుగా గుర్తించడం జరిగింది. వీటిని – ఆర్థికంగా అవి ఏ మేరకు సాధ్యం మరియు అవి నెలకొన్న ప్రదేశాలకు అనుగుణంగా మూడు విభాగాలుగా వర్గీకరించడం జరిగింది. దానికి తోడు అవి ఉన్న ప్రదేశాలకు అనుగుణంగా వాటిని తిరిగి ఎనిమిది క్లస్టర్లుగా విభజించారు. మొదటి దశలో కేటగిరీ–I లోని ఎనిమిది జాతీయ జలమార్గాలను అభివృద్ధి చేస్తారు. అనంతరం 2016, మార్చి తర్వాత కోస్తా ప్రాంతాలలో అలల తాకిడి కలిగిన కేటగిరీ–II లోని మొత్తం 60 జలమార్గాలలోని 54 మార్గాలను అవి ఏ మేరకు సాధ్యమన్న నివేదికలను బట్టి అభివృద్ధి చేస్తారు.

**జాతీయ జలమార్గాల చట్టం, 2016:** 2015, మే 5న కేంద్ర నౌకా, రోడ్డు రవాణా, హైవేల మంత్రి నితిన్ గడ్కరీ జాతీయ జలమార్గాల చట్టం, 2016ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ చట్టం కింద అప్పటివరకు ఉన్న ఐదు చట్టాలను ఏకం చేశారు. అప్పటివరకు ఉన్న ఐదు జాతీయ జలమార్గాలకు అదనంగా మరో 101 జలమార్గాలను ప్రతిపాదించారు. దాని ప్రకారం అది 2016, ఏప్రిల్ 12 నుంచి అమలులోకి వచ్చింది. దీని ద్వారా అప్పటికే ఉన్న జలమార్గాలే కాకుండా, భూభాగంపై ఉన్న జలమార్గాలను కూడా జాతీయ జలమార్గాలుగా గుర్తించేందుకు వీలు కల్పించారు. తద్వారా ఆ జలమార్గాలను నియంత్రించడానికి, వాటిని అభివృద్ధి చేయడానికి, వాటి ద్వారా నౌకాయానం, ఓడ రవాణా చేయడానికి అవకాశం కలిగింది.

భారత దేశం గణతంత్ర దేశంగా అవతరించిన 67 ఏళ్ల అనంతరం రూపుదిద్దుకున్న ఈ జాతీయ జలమార్గాల చట్టం, 2016లోని సెక్షన్ 2 – దేశమధ్యగత జలమార్గాలను జాతీయ జలమార్గాలుగా పేర్కొనాలని ప్రతిపాదించింది. ఈ చట్టం కింద, ఈ జాతీయ జలమార్గాలను ఓడ రవాణా మరియు నౌకాయానం కొరకు ఉపయోగించుకుంటారు. వాటి నియంత్రణ, అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతాయి.

**సమస్యలు:** సరుకు రవాణాలో జలమార్గాలను తక్కువగా ఉపయోగించు కోవడాన్ని దృష్టిలో పెట్టుకుని, ఈ చట్టాన్ని రూపొందించడం జరిగింది. అయితే భూమిపైని జలమార్గాలు సరుకు రవాణాలో పురాతన కాలం నుంచీ ఎంతో ముఖ్యపాత్రను పోషించాయని మనం గుర్తించాలి. అయితే క్రమంగా రోడ్డు, రైలు రవాణా విస్తరించడంతో జలమార్గాలు తమ ప్రాముఖ్యతను కోల్పోతూ వచ్చాయి.

భూమిపై ఉన్న జలమార్గాల ద్వారా ఓడ రవాణాను, నౌకాయానాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ప్రయత్నం కాగితాల మీద చూసినప్పుడు అభినందించ దగ్గదే అయినప్పటికీ, కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు మన ముందు నిలుస్తాయి. నదుల్లో ఉన్న నీటిని నీటి పారుదల కోసం ఉపయోగించడం, నీటి పారుదల కోసం నదుల్లో నీటిని కాలువలకు మళ్లించడం తదితర కారణాల వల్ల, నదులలో ఇలాంటి జలమార్గాలను సృష్టించడం ఎంతమేరకు ప్రయోజన కరమన్నది సందేహాస్పదం. రెండోది: నదుల్లో మట్టి పూడుకుపోయి, లోతు తక్కువ కావడం వల్ల నౌకాయాన యోగ్యమైన జలాలు తగ్గిపోతున్నాయి. అంతే కాకుండా, ఉపఖండంలోని నదుల్లో నీటి లభ్యత వర్షపాతం మీద ఆధారపడి ఉంటుంది. దీంతో వర్షాలు కురవని కాలంలో వాటి ద్వారా నౌకాయానం కష్టమవుతంది.

దేశంలోని అనేక నదులు తక్కువ లోతు, ఇసుకతో నిండిన డెల్టా కాలువల ద్వారా సముద్రంలో కలుస్తాయి. అందువల్ల డ్రెడ్జింగ్ చేస్తే తప్ప వాటిలో నౌకాయానం సాధ్యం కాదు. దీనికితోడు, నౌకాయానానికి తగిన ఉపకరణాలు లేకపోవడం వల్ల వాటిలో ప్రయాణించడం అంత సురక్షితం కాదు. దేశంలో అనేక టెర్మినల్ పాయింట్ల వద్ద సరుకులు ఎత్తడానికి, దించడానికి తగిన సౌకర్యాలు ఉండడం లేదు. దీనికితోడు – మౌలిక సదుపాయాల లేమి, ఆధునీకరణ జరగకపోవడం, తగిన సమర్థత కలిగిన ఆపరేటర్లు లేకపోవడం మరో లోటు. జలవిద్యుత్ కోసం డ్యాముల నిర్మాణం నౌకాయానాన్ని మరింత జటిలం చేస్తోంది.

**ప్రయోజనాలు:** భూభాగంలోని జలమార్గాల ద్వారా రవాణా వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. తక్కువ ఖర్చులో రవాణా, తక్కువ నిర్వహణాపరమైన ఖర్చు, తక్కువ శక్తి వినియోగం, ఇతర రవాణాలతో పోలిస్తే తక్కువ కర్బన ఉద్గారాలు మొ.వి. బొగ్గు వంటి వాటిని భారీగా రవాణా చేసే సౌకర్యం ఉండడం మరో అదనపు ప్రయోజనం.

ఈ చట్టం ద్వారా దేశంలోని 11 నదులను జలమార్గాలుగా మార్చాలని, తద్వారా రవాణా ఖర్చులను తగ్గించి, ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలని ప్రతిపాదించారు. రోడ్డు రవాణా ద్వారా ఏటా 5 లక్షల ప్రమాదాలు జరుగుతున్నాయి. 1.5 లక్షల మంది మరణిస్తున్నారు. అంతే కాకుండా అది జలరవాణా అంత పర్యావరణహితం కూడా కాదు.

**ముగింపు:** భూభాగంపైన ఉన్న జలమార్గాలను అభివృద్ధి చేయాలన్న ఆలోచన మంచిదే అయినప్పటికీ, జలవనరులు నానాటికీ తగ్గిపోతున్న మనలాంటి దేశంలో, నీటిలో భారీస్థాయి రవాణా ఏ మేరకు ప్రయోజనమన్నది ఆలోచించాలి. అంతేకాకుండా జలరవాణా నదుల పర్యావరణం, జలచరాలు, జాలరుల జీవనోపాధులమీద తీవ్ర ప్రభావం చూపుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ చట్టం పూర్తిగా అమలైతే, దాని ప్రభావం నదుల మీద ఆధారపడే మత్స్యకారులు, ఇతర ప్రజల జీవితాలు, జీవనోపాధుల మీద ప్రభావం చూపుతుంది. అందువల్ల ముందుగా జలరవాణా అవకాశాలపై ఒక బ్లూ ప్రింట్‌ను తయారు చేసుకుంటే, దాని వల్ల కర్బన ఉద్గారాలను తగ్గించడానికి అవకాశం ఉంటుంది. జలమార్గాల ద్వారా రవాణా వల్ల ఒనగూరే లాభాల గురించి ప్రభుత్వం ప్రచారం చేయడం అవసరం. అదే సమయంలో జలరవాణాలోని కీలక భాగస్వాముల సమస్యలను తెలుసుకోవడం, వారి సందేహాలు, అనుమానాలను నివృత్తి చేయడం ద్వారా మాత్రమే ప్రభుత్వం జలమార్గాల ద్వారా రవాణాను పెంచగలదు. అప్పుడే జలమార్గాల ద్వారా ఇతరులు నష్టపోకుండా తగిన ప్రయోజనం చేకూరుతుంది. ✷

జీవన తంత్రం

## చేప కథ




ఒక చేపలు పట్టేవాడు ఒక చేపను పట్టుకుని మహారాజు దగ్గరికి వెళ్ళాడు.
ఆ చేపను మహారాజు గారికి సమర్పించి ఇలా అన్నాడు....
"మహారాజా! ఈ చేప చాలా ప్రత్యేకమైనది....ఇది మీ దగ్గర ఉంటేనే బాగుంటుంది." అన్నాడు.
చేప చాలా బాగుందని రాజుగారు ముచ్చటపడి ఆ చేపను తీసుకుని అతనికి 5000ల వరహాలు ఇచ్చాడు....
అది చూసిన మహారాణికి చిన్న చేపకు 5000 వరహాలు ఇవ్వడం నచ్చలేదు. రాజు గారితో ఇలా అంది. "మహారాజా! చేపను తెచ్చి ఇచ్చిన అతనికి 5000ల వరహాలు ఇవ్వడం నాకు నచ్చలేదు. ఆ చేపను ఇచ్చేసి ఆ వరాహాలను వెనక్కు తీసుకోండి" దానికి మహారాజు ఇలా అన్నాడు.
"ఒక చేపలు పట్టి బ్రతుకుతున్న వ్యక్తికి ఇచ్చిన కానుకను వెనక్కి తీసుకోవడం మంచిదికాదు. ఆ ఆలోచన మానుకో" అన్నాడు. కానీ, రాణి ససేమిరా ఒప్పుకోలేదు. ఎలాగైనా వరహాలను వెనక్కు తీసుకోవాలని రాజుగారిని ఒత్తిడి చేసింది. చేసేదేంలేక రాజుగారు ఒప్పుకుని ఎలా వెనక్కుతీసుకోవాలో చెప్పమని రాణినే అడిగారు. దానికి రాణి ఇలా అన్నది.
"చేప ఆడదో......మగదో అడిగి తెలుసుకోండి. వాడు ఆడది అంటే మాకు మగ చేపకావాలి అనీ .... మగచేప అని అంటే మాకు ఆడచేప కావాలని చెప్పి తెలివిగా చేపను వెనక్కి ఇచ్చి వరహాలు వెనక్కు తీసుకుందాం".
రాజుగారు ఆ చేపలు పట్టేవాణ్ణి పిలిచి చేప ఆడదా, మగదా అని అన్యమనస్కంగా అడిగాడు. దానికి ఆ చేపలు పట్టేవాడు ఇలా సమాధానం ఇచ్చాడు. "మహారాజా! ఆడచేప కాదు......మగచేప కాదు. చాలా వింతైన చేప కాబట్టే మీకు ఇచ్చాను".
ఆ సమాధానానికి మెచ్చి రాజుగారు మరో 5000ల వరహాలు ఇచ్చాడు. అలా ఇస్తున్నప్పుడు ఒక వరహా జారి కిందపడిపోయింది. దానికోసం అతను వెదుకుతుండగా మహారాణి మళ్ళీ ఇలా అన్నది.
"చూశారా! మహారాజా! వాడి పిసినారితనం ..... లేకితనం...మిమ్మల్ని ఎలా బురిడీ కొట్టించి మరొక 5000ల వరహాలు కొట్టేశాడు. అతన్ని అడగండీ" రాజుగారు అతన్ని ఇలా అడిగాడు "నీకు 10000ల వరహాలు వచ్చాయి కదా! మళ్ళీ కిందపడిపోయిన ఒక్క వరహా కోసం ఎందుకు అంతలా వెతుకుతున్నావు". దానికి ఆ చేపలు పట్టేవాడు ఇలా సమాధానం చెప్పాడు.
"మహారాజా! నాకు, నా కుటుంబానికి సరిపడా సంపాదనను మీరే నాకు కల్పిస్తున్నారు. అలాంటి మీరంటే చాలా గౌరవం మాకు. ఆ వరహా మీద మీ రూపు ఉంటుంది కదా! పొరపాటున కూడా దాన్ని ఎవరూ తొక్కడం నాకు ఇష్టంలేదు మహారాజా! అందుకే ఆ ఒక్క వరహాను వెతుకుతున్నాను.
అది విన్న మహారాజు మరొక 5000ల వరహాలు కానుకగా ఇచ్చి పంపించారు.
నీతి: మనకంటే తక్కువ స్థాయిలో ఉన్నవారిని తక్కువగా అంచనా వేయకూడదు....చదువుకోలేకపోయినా వారికి తెలివితేటలు ఉండవనీ... బాగా చదువుకున్నాము కాబట్టి బాగా తెలివి తేటలు ఉంటాయని ఒక అభిప్రాయానికి రాకూడదు. కొంతమందికి జీవితమే ఎన్నో తెలివితేటలను.....అనుభవాలతో కూడిన శక్తియుక్తులను ఇస్తుందని తెలుసుకోవాలి. ✷

వ్యాపారం

సామాజిక



### స్మైల్ ఆన్ వీల్స్ (SoW) ద్వారా హెల్త్ క్యాంప్




### జూన్ 21, అంతర్జాతీయ యోగా దినోత్సవం

క్లాసిక్ పుస్తకం

## విలేజ్ స్వరాజ్

రచయిత – మహాత్మా గాంధీ




మహాత్మా గాంధీ గారి ఆలోచనల నుండి వచ్చిన సంకలన రూపమే ఈ పుస్తకం. ఇందులో గ్రామీణ జీవనానికి సంబంధించిన వివిధ విషయాలను వివరించింది. ముఖ్యంగా ఇది వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, రవాణా, పశుగణాభివృద్ధి, కనీస విద్య మరియు ఆరోగ్యం, పరిశుభ్రతలను గూర్చి తెలుపుతుంది.

గాంధీగారు 'స్వరాజ్' ఆదర్శ గ్రామానికి సంబంధించి అనేక విషయాలను వివరించినాడు. అవి వరుసగా ప్రజాస్వామ్యం, గ్రామాలకు–పట్టణాలకు గల తేడా, గ్రామ స్వరాజ్యంనకు సంబంధించిన సూత్రాలు, కార్మికులు, సమానత్వం, ధర్మకర్తృత్వ సిద్ధాంతం, పశువులు, ఖాదీ మరియు స్పిన్నింగ్ ఇతర గ్రామీణ పరిశ్రమలు, గ్రామ రవాణా, కరెన్సీ, పన్నులు మరియు వాటి మార్పిడి, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహారం, గ్రామరక్షణ, గ్రామ కార్మికులు, గ్రామం, పట్టణం, దేశం, ప్రపంచంలోని ప్రభుత్వాల గూర్చి తెలుపుతుంది.

వికేంద్రీకరణలో భాగంగా రాజకీయ మరియు ఆర్థిక అధికారాలను గ్రామ పంచాయతీలకు కల్పించటం వల్ల గ్రామాలలో సాంఘిక, ఆర్థిక అభివృద్ధి జరుగుతుంది. తద్వారా దేశం కూడా అభివృద్ధి చెందుతుంది. ప్రతి గ్రామం తన అవసరాలను తాను తీర్చుకోగలిగేలా తగిన అధికారాలు ఉండాలని స్వయం సమృద్ధిని సాధించేలా రూపొందించాలని గాంధీగారు వివరించారు.

దేశంలో ఉండే ప్రతి పౌరులు సాంకేతిక నైపుణ్యాలు, వివిధ కళలను కలిగి ఉండాలి. ఏ ఒక్కరు కూడా పనిలేకుండా కూర్చోకూడదు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి గ్రామం 'స్వరాజ్'గా మారాలని తద్వారా తన అవసరాలు తామే తీర్చుకునేందుకు స్వయంప్రతిపత్తి గల స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రజలకు పూర్తి స్వేచ్ఛ సహకారాలను అందించాలి. అప్పుడు మాత్రమే దేశం అభివృద్ధి చెందుతుందని గాంధీ గారు అభిప్రాయ పడ్డారు.

ఈ పుస్తకం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ వర్కర్లకు ప్రభుత్వ అధికారులకు, గ్రామీణ అభివృద్ధిలో ఎంతగానో ఉపయోగపడుతుంది. ✷

లేటెస్ట్ పుస్తకం

## డీసెంట్రలైజేషన్ అండ్ పాపులర్ డెమొక్రసీ

రచయిత – జీన్–పాల్ ఫాగెట్




'డీసెంట్రలైజేషన్ అండ్ పాపులర్ డెమొక్రసీ: గవర్నెన్స్ ఫ్రం బిలో ఇన్ బొలీవియా' అను పుస్తకం బొలివియా దేశంలో ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ద్వారా ప్రభుత్వం ప్రజలకు ఏవిధంగా మెరుగైన సేవలను అందించటం మరియు జవాబుదారీతనంను వివరిస్తుంది.

అంతేగాకుండా వికేంద్రీకరణ వల్ల కలిగే లాభాలను పరిమాణాత్మక ఆర్థిక గణనను సాక్ష్యం రూపంలో వివరించింది. తద్వారా అభివృద్ధికి సంబంధించిన సంస్కరణలను, సిఫార్సులను గూర్చి ఈ పుస్తకం తెలుపుతుంది.

వికేంద్రీకరణ క్షేత్రస్థాయిలో పనిచేయటం వల్ల దేశానికి, పౌరులకు ఉన్న అగాధలను ఏవిధంగా అధిగమించిందో వివరణాత్మకంగా తెలియజేసింది. ✷

లేటెస్ట్ పుస్తకం

## డీసెంట్రలైజేషన్ అండ్ లోకల్ గవర్నెన్స్

రచయిత – ప్రణబ్ బర్ధన్ మరియు దిలిప్ ముఖర్జీ



'డీసెంట్రలైజేషన్ అండ్ లోకల్ గవర్నెన్స్ ఇన్ డెవలపింగ్ కంట్రీస్: ఎ కంపరాటివ్ పర్స్పెక్టివ్' అను పుస్తకం 8 దేశాలలోని వికేంద్రీకరణకు సంబంధించిన కేస్‌స్టడీల సంకలనము. ఆయా దేశాలు వరుసగా బొలీవియా, బ్రెజిల్, చైనా, ఇండోనేషియా, ఇండియా, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా మరియు ఉగాండాలు కలవు.

ఈ పుస్తకం గత 3 దశాబ్దాలుగా వికేంద్రీకరణకు సంబంధించిన కార్యక్రమాలు ప్రపంచంలో మరియు పైన పేర్కొన్న 8 దేశాలలో ఏవిధంగా జరుగుతున్నాయో వివరించే ప్రయత్నం చేసింది. ఇది వికేంద్రీకరణ మరియు దాని అభివృద్ధి పరిణామాలను ఆయా దేశాలలో ప్రభావితం జరిగిన తీరును వివరిస్తుంది. ✷

**ఈ-వనరులు**

| | |
|---|---|
| విలువ గొలుసు | – http://aksharakriti.org/magazines/doc_download/547-fishing-vca-mukteshwaram |
| ఉపరంగం | – http://gala.gre.ac.uk/12201/1/Doc-0555.pdf |
| ఈ–పుస్తకం | – http://www.mkgandhi.org/ebks/village_swaraj.pdf |
| వీడియో | – https://www.youtube.com/watch?v=gpGFAg_KesY |

**అనుబంధాలు**

| | |
|---|---|
| బృహత్ ప్రయత్నం | : http://aksharakriti.org/magazines/doc_download/552-jeevanopadhulurtf-june-2016 |
| క్షేత్రం | : http://aksharakriti.org/magazines/doc_download/553-jeevanopadhulukshetramaravali-range-2016 |
| లైవ్లీహుడ్స్ మేనేజ్‌మెంట్ నోట్స్ | : http://aksharakriti.org/magazines/doc_download/548-supplementlivelihoods-management-notesjune-2016 |

**ఈ-కోర్సు**

ఈ–లైవ్లీహుడ్స్ లెర్నింగ్ కోర్స్ : క్యాప్సుల్ నెం: 295 – 317

http://aksharakriti.org/magazines/doc_download/546-e-coursejune-2016

# 'యోగ'క్షేమం

*పర్యావరణ దినోత్సవం! సంగీత దినోత్సవం!*

*యోగా దినోత్సవం! ఉత్తరాయణం!*

*పాఠశాలలు మళ్లీ ప్రారంభమయ్యాయి.*

*రుతుపవనాలు ప్రవేశించాయి. ఆలస్యమైనా వర్షాలు కురవడం ప్రారంభమైంది.*

యోగ సమ్మేళనాన్ని కోరుతుంది. యోగ స్వేచ్ఛను కోరుతుంది. యోగ అంటే అంతర్ముఖం. యోగ అంటే ప్రకృతిని పరిశోధించి, ఆస్వాదించడం. యోగ అంటే సంబంధాలు. యోగ అంటే ఒక బంధనం.

ఇది జీవితంలోని మూడో దశకు మారే తరుణం. ఒక జీవన కార్యకర్తగా నేను యోగ ప్రాముఖ్యతను గుర్తిస్తున్నాను. విధి నిర్వహణలో నేను నాలుగు అంశాలను గుర్తించాను..

♦ యాత్ర – ఆస్వాదించడం, ఉపయుక్తంగా ఉండడం
- ఒక ఏడాదిలో అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు
- 2–3 ఏళ్లలో అన్ని ప్రాంతాలు
- 4–5 ఏళ్లలో అన్ని జిల్లాలు
- 5–7 ఏళ్లలో 50% బ్లాకులు
- 7–8 ఏళ్లలో 5 % గ్రామపంచాయితీలు
- 8–9 ఏళ్లలో 5 % గ్రామాలు

♦ 9–10 ఏళ్లలో సమిష్టి సంఘాలను ప్రభావితం చేసే విధంగా తయారు కావడం
- 1000 స్థానిక ప్రజా సంస్థలు
- 1000 గ్రామ పంచాయితీలు
- 500 క్లస్టర్ మరియు ఆ పై స్థాయిలో సమిష్టి సంఘాలు
- 500 పౌర సామాజిక సంస్థలు
- 100 సంస్థలు/ఎంటర్ప్రైజెస్/ఫౌండేషన్లు
- 100 రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలు/కార్యక్రమాలు
- 10 జాతీయ ప్రభుత్వ సంస్థలు/కార్యక్రమాలు

♦ 9–10 ఏళ్లలో వ్యక్తుల మార్గదర్శకం/అభ్యసించేలా ప్రభావితం
- 10 మిలియన్, 1–2 గంటలు
- 1 మిలియన్, 5–6 గంటలు
- 100 వేలు, 2–6 రోజులు
- 10 వేలు, 2–6 వారాలు
- 5 వేలు, 2–6 నెలలు
- 1 వేయి, 1–2 ఏళ్లు
- 100, 3–5 ఏళ్లు
- 25, 6–8 ఏళ్లు
- 12, జీవిత కార్యకర్తలు

♦ సహాయపడే అవకాశమున్న అంశాలు
- మార్గనిర్దేశకులు, జీవన కార్యకర్తలు, ఫెలోస్, ఇంటర్న్లు
- వృత్తినైపుణ్య సహాయకుల నెట్వర్క్
- కలను రూపొందించుకోవడం
- నాయకత్వం
- పత్రికలు, పోర్టల్, ఛానెల్
- పుస్తకాలు
- సమిష్టీకరణ, సమిష్టి సంఘాల కేంద్రాలు
- గిరిజన, గ్రామీణ, పట్టణ ఆవిర్భవిస్తున్న (TRUE) జీవనోపాధుల సహకారం
- స్వయం ఉపాధి, పరిశ్రమలు, ఉద్యోగ కేంద్రాలు
- ఆరోగ్యం, విద్య, ట్యూషన్ సెంటర్లు
- గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలను దత్తత తీసుకోవడం
- కమ్యూనిటీ రిసోర్స్ కేంద్రాలు
- జీవనోపాధుల విద్య
- అభ్యసన కేంద్రాలు
- కెరీర్ కౌన్సెలింగ్
- కోచింగ్
- వెబ్ మార్కెటింగ్
- సామాజిక పరిశ్రమలు, సామాజిక ఎంటర్ప్రెన్యూర్షిప్ అభివృద్ధి
- మొ.వి.

మనం సహాయం చేస్తాం. మనం పని చేస్తాం. మనం సంయోగాన్ని కోరుకుంటాం. మనం యోగను ఆచరిస్తాం. మనం తరచి చూసుకుంటాం. మనం సమీక్షించుకుంటాం. మనం సమీక్షలకు సహకరిస్తాం. మనం ప్రణాళికా రూపకల్పనకు సహకరిస్తాం. మనం సమిష్టీకరణ కోసం పని చేస్తాం. మనం సమ్మిళితం కోసం పని చేస్తాం. మనం నిస్సహాయత్వ నిర్మూలన కోసం పని చేస్తాం. మనం కేంద్రీకరణ కోరుకుంటాం. మనం సమిష్టి సంఘాలకు సహకరిస్తాం. మనం ఉపాధిని పెంచుతాం. మనం ఎలాంటి విపత్తులూ లేకుండా ఉండేందుకు సహకరిస్తాం.

మనం కలిసి ఉండడాన్ని, కలిసి ప్రవహించడాన్ని, కలిసి చేయడాన్ని, కలిసి జీవితాన్ని ఆస్వాదించడాన్ని కోరుకుంటాం. జీవిత స్ఫూర్తిని మనం కలిసి జీవిస్తాం. ఈ సృష్టి మాలో జీవిస్తుంది. ఇదే యోగ. ఇదే సహాయోగం.

మనం అక్కడికి చేరుకోగలమా? **ఆత్మయోగను అనుసరిస్తే అది సాధ్యమే.** మనం దృష్టి కేంద్రీకరిస్తే! మనం ఆచరిస్తే! మనం విశ్వసిస్తే! మనం నమ్మితే! మనం అందుకు సిద్ధంగా ఉంటే! మనం ఈ సమయంలో, వర్తమానంలో ఉంటే! జ్ఞాన, కర్మ, భక్తితో కూడిన యోగం ఈ సృష్టిలో ఐక్యం కావడం తథ్యమని కృష్ణుడు చెబుతాడు.

మా యోగ ప్రపంచంలోకి రండి– మన గుర్తింపు, సంఘీభావం, సామర్థ్యం, హక్కులను పొందే అవకాశం, మన శ్రేయస్సు ఫలితంగా మన జీవితాలు, జీవనోపాధులు రూపాంతరం చెందేందుకు, స్వేచ్ఛను పొందేందుకు, ఈ సృష్టి ముందు మోకరిల్లేందుకు – **కృష్ణజ్ఞానయోగసిద్ధి** వైపుకు. అందుకు మీరెన్నడూ చింతించరు.

**–జి. మురళీధర్** ✸



*Note: We are requesting our partners to take over bringing out 'livelihoods' in local languages, with effect from October 2016. As part of this policy, we will not be attempting to give 'Jeevanopadhulu' from October 2016 directly on our own. Kindly note.*



జీవనోపాధులు